


visit us @ https://www.suryaepaper.com

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఆదివారం | 22 మార్చి 2026 | హైదరాబాద్

సంపుటి 19 | సంచిక 153
| పేజీలు 10+8 | వెల: రూ. 8.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



- APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
- నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
- కరెంట్ అఫైర్స్
- నమూనా ప్రశ్నాపత్రాలు
- విద్యా ఉద్యోగ సమాచారం

'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ పరాభవ నామ సంవత్సరం : ఉత్తరాయణం - వసంత రుతువు, చైత్ర మాసం శుక్ల పక్షం, చవితి రా.12.08, భరణి రా.1.33 వర్జ్యం రా.11.59 నుంచి 1.30 వరకు
రాహుకాలం సా.4.30 నుంచి 6.00 వరకు దుర్ముహూర్తం సా.4.30 నుంచి 5.18 వరకు

## స్వేచ్ఛా నౌకాయానం

# కాపాడుదాం

## సముద్ర మార్గాల భద్రత ముఖ్యం : మోడీ

- ఇరాన్ అధ్యక్షుడు పెజిష్కియాన్‌తో ప్రధాని మోడీ ఫోన్‌లో మాటా మంతి
- ఈద్, నౌరోజ్ శుభాకాంక్షలు తెలిపిన పీఎం
- పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్ష
- దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని ఆందోళన
- ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తాయని స్పష్టీకరణ



6 లో

పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్తో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఇరాన్ అధ్యక్షుడికి ఈద్, నౌరోజ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ సీజన్ పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ పశ్చిమాసియాలోని కీలక మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని, ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛను కాపాడడం, సముద్ర రవాణా మార్గాలను సురక్షితంగా ఉంచడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. అంతేకాదు ఇరాన్లో ఉన్న భారత పౌరుల భద్రతకు సంబంధించి అక్కడి ప్రభుత్వం అందిస్తున్న నిరంతర సహకారానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## నేడు ఆయిల్ ఫామ్

# ఫ్యాక్టరీ ప్రారంభం

### ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు తుమ్మల, పొన్నం



3 లో

సిద్దిపేట జిల్లా నర్మేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నేపథ్యంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ అధికారులు తో కలిసి ఏర్పాట్లను శనివారం సమీక్షించారు. ముందుగా హెలిప్యాడ్‌ను పరిశీలించిన మంత్రులు భద్రతా ఏర్పాట్లపై పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం కర్మాగారం ప్రారంభోత్సవ ప్రాంగణానికి వెళ్లి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 150 స్టాళ్లను సందర్శించారు. ముఖ్యమంత్రి స్టాళ్లను పరిశీలించడంతో పాటు ఆయిల్ రిఫైనరీకి శంకుస్థాపన చేయనున్న ప్రదేశాన్ని కూడా పరిశీలించనున్నారు. సభ స్థలిలో జరుగుతున్న ఏర్పాట్లను కూడా అధికారులు సమీక్షించారు.

## రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

- ముస్లిం సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి
- సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తుందని వెల్లడి

ఇస్లాం మతస్తులు అత్యంత పవిత్రంగా ఆచరించే రంజాన్ వేడుకలను ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన పలు ప్రార్థనల్లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు.



7 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## జీవన్ రెడ్డితో ముగిసిన

# మంత్రుల భేటీ

- పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి
- తన నిర్ణయం మారదంటున్న జీవన్ రెడ్డి



3 లో

కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌ల భేటీ ముగిసింది. పార్టీ పెద్దల తీరుపై గత కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్న జీవన్ రెడ్డి.. కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి.. బీఆర్ఎస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో జీవన్ రెడ్డిని కలిసిన మంత్రులు.. ఆయనను బుజ్జగించే ప్రయత్నం చేశారు. చాలా సమయం జీవన్ రెడ్డితో చర్చలు జరిపిన మంత్రులు.. పార్టీలో ఆయనకు సముచిత ప్రాధాన్యం దక్కేలా అధిష్ఠానం చూసుకుంటుందని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

## సర్పంచ్‌ల ఫీడ్‌బ్యాక్‌కు అధిక ప్రాధాన్యత

- మంత్రి సీతక్క ఆదేశాలతో రంగంలోకి మిషన్ భగీరథ ఇంజనీర్-ఇన్-చీఫ్
- సర్పంచులు గుర్తించిన తాగు నీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు



7 లో

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ఇంజనీర్-ఇన్-చీఫ్ కార్యాలయం నుండి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల సర్పంచులతో నేరుగా అనుసంధానం చేపట్టి తాగునీటి సరఫరా వ్యవస్థపై సమగ్ర ఫీడ్‌బ్యాక్ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. గత పది రోజులుగా ఫోన్ ద్వారా సర్పంచులతో సంప్రదింపులు జరిపి, మొత్తం 12,728 గ్రామ పంచాయతీలలో 12,457 మంది సర్పంచుల అభిప్రాయాలను సేకరించారు.


## ఇరాన్ మిస్సైల్ పరిధి 4వేల కిలో మీటర్లు?

- డిగో గార్సియాపై దాడితో ఉలిక్కిపడ్డ ప్రపంచం
- ప్రకటించిన పరిధిని మించి ఇరాన్ క్షిపణి ప్రయోగం
- డిగో గార్సియాపై రెండు బాలిస్టిక్ మిస్సైళ్లతో దాడి ప్రయత్నం
- ఒకటి విఫలం, మరొకదాన్ని అడ్డుకున్న అమెరికా



6 లో

## అంతా ఇంతే!



సిలిండర్లు వచ్చేదాకా వంట చేసేది లేదండీ !

## ఇరాన్‌పై దాడులను

# ఖండించరా



- ఇజ్రాయెల్, అమెరికా దాడుల ఖండించని మోదీ సర్కార్
- ఇది సర్కార్ పిరికితనానికి, ద్రోహానికి నిదర్శనం
- భారత నాగరికత విలువలకు ద్రోహం చేసినట్లే
- కాంగ్రెస్ విమర్శలు


వివరాలు-6లో

## దేశానికి రక్షణ

# మరింత పటిష్టం

- భారీ సైన్యం అవసర మన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- యుద్ధ స్వరూపం పరిణామం మారుతోంది
- సాంకేతికత రంగరించుకుని కొత్త పుంతలు తొక్కి సరిహద్దులు దాటుతోంది
- దేశ రక్షణ కోసం అంతా ఐకమత్యంగా ఉండాల్సిన తరుణమిది
- పౌరుల మద్దతు కలిగిన బలమైన సైన్యం అవసరం
- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

యుద్ధ స్వరూపం పరిణామం చెందుతోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. జాతీయ భద్రత అనేది ఇప్పుడు ఆర్థిక, డిజిటల్, ఇంధనం, ఆహార భద్రతలను సైతం తన పరిధిలోకి తీసుకుందని మంత్రి వివరించారు. దేశ రక్షణ కోసం ఐకమత్యంగా ఉండే పౌరుల మద్దతు కలిగిన బలమైన సైన్యం అవసరమని నొక్కిచెప్పారు.



6 లో

## ఇంకెంత

# కాలం మోసం

- బీసీలు తిరగబడే రోజులు వచ్చాయి
- హక్కులు కావాలంటే.. అణచివేస్తున్న పాలకులు
- రాజ్యాధికారంలో వాటా లేదు ఆర్థికంగా చేయూత లేదు
- బడ్జెట్‌లో బీసీలకు మొండి చెయ్యి
- అన్యాయం - దగా - బీసీ వ్యతిరేక వైఖరి మార్చుకోవాలి
- ప్రభుత్వ వైఖరిపై 14 బీసీ సంఘాల సమావేశంలో బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆగ్రహం

దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచిపోయినా..ఇంకా బీసీలను అన్ని రంగాల్లో అణచివేస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పాలకుల పై ధ్వజమెత్తారు. గత 50 ఏళ్లకు పైగా రాజ్యాధికారంలో వాటా ఇవ్వాలని పోరాటం చేస్తున్నా..పాలకులకు కనువిప్పు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



7 లో




# నేడు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

## ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు తుమ్మల, పొన్నం



తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః సిద్దిపేట జిల్లా నర్మేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నేపథ్యంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ అధికారులు తో కలిసి ఏర్పాట్లను శనివారం సమీక్షించారు. ముందుగా హెలిప్యాడ్‌ను పరిశీలించిన మంత్రులు భద్రతా ఏర్పాట్లపై పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం కర్మాగారం ప్రారంభోత్సవ ప్రాంగణానికి వెళ్లి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 150 స్టాళ్లను సందర్శించారు. ముఖ్యమంత్రి స్టాళ్లను పరిశీలించడంతో పాటు ఆయిల్ రిఫైనరీకి శంకుస్థాపన చేయనున్న ప్రదేశాన్ని కూడా పరిశీలించనున్నారు. సభ స్థలిలో జరుగుతున్న ఏర్పాట్లను కూడా అధికారులు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రైతులకు లాభదాయకం: మంత్రి పొన్నం ప్రభాకర్**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో ఆయిల్ ఫామ్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తాను స్వయంగా రైతుగా ఈ ఫ్యాక్టరీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు ద్వారా కోతుల బెడద ఉండదని, వర్షాల ప్రభావం తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

ఈ ఫ్యాక్టరీ ఉత్తర తెలంగాణ రైతులకు ప్రధాన కేంద్రంగా మారుతుందని, గంటకు 30 టన్నుల నుంచి 180 టన్నుల వరకు క్రషింగ్ సామర్థ్యం ఉందన్నారు. రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

**16 నెలల్లోనే నిర్మాణం పూర్తి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 32 ఎకరాల్లో రూ.300 కోట్లతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీని కేవలం 16 నెలల్లో పూర్తి చేయడం విశేషమన్నారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు అవకాశముందని తెలిపారు. ఇక్కడే ఏర్పడే వ్యర్థాలతో 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. అలాగే స్వతంత్ర ఆయిల్ రిఫైనరీ ద్వారా నేరుగా వినియోగదారులకు నూనె అందించనున్నట్లు చెప్పారు. రైతులు పండించిన గెలను విక్రయించిన మూడు రోజుల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు. ఇప్పటివరకు ఆయిల్ ఫామ్ ఉత్పత్తిని అశ్వారావుపేటకు తరలించాల్సి వచ్చేదని, ఇప్పుడు నర్మేట ఫ్యాక్టరీతో ఆ సమస్య తీరిందన్నారు. తెలంగాణను దేశంలో ఆయిల్ ఫామ్ ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిపే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**రైతు సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబాటు**

రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. దేశంలోనే ఒకేసారి భారీ స్థాయిలో రుణమాఫీ చేసిన రాష్ట్రం తెలంగాణేనని అన్నారు. నేడు జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా రైతు భరోసా కింద రూ.3600 కోట్లను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. రైతులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు.

# ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నావ్ రేవంత్

- సీఎం ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదు
- అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే
- మాది శ్రమ ఫలితం.. మీది శిలా ఫలకం
- సీఎంకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి :తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. సీఎం రేవంత్ నేడు ఆదివారం సిద్దిపేట పర్యటన నేపథ్యంలో పలు ప్రశ్నలు సంధిస్తూ లేఖ విడుదల చేశారు. నేడు సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు హరీశ్ రావు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా, రేపు సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 365 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ..'సీఎం రేవంత్ రెడ్డి రేపు ప్రారంభించే ఆయిల్ ఫ్యాక్టరీ 2021లోనే ప్రారంభించాం. ఈ ఆయిల్ ఫామ్‌కి ప్రాణాధారం కాళేశ్వరం ప్రాజెక్టు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం అన్న రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలి. కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. మొక్కవోని దీక్షతో పూర్తి చేసింది మేము. ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడంలో అనేక విధాలుగా శ్రమ పడ్డాం. 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం. మలేషియా టెక్నాలజీతో ఇండియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాం. బీఆర్ఎస్ కృషి ఫలితమే ఆయిల్ ఫ్యాక్టరీ. దాన్ని ఈరోజు రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి, రెండు పీహెచ్సీలు నేను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండగా మంజూరు చేసి పూర్తి చేసినవి.

వీటికి మీరు శిలాఫలకం వేసుకుని ప్రారంభిస్తున్నారు. ఇందులో మీరు చేసిందేమీ లేదు. మేము ఆలయాలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు, జైళ్లు నిర్మించాం. రూ.78కోట్లతో 30 ఎకరాల్లో జిల్లా జైలు నిర్మించాం. కట్టించింది మేము, శిలాఫలకం మీరు వేసుకున్నారు. చేసుకో నాకేమీ ఈర్ష్య లేదు. కానీ శ్రమ ఎవరిది, శిలాఫలకం ఎవరిది?. కనపడిన ప్రతి దేవుడు మీద ఒట్టుపెట్టి రుణమాఫీ అన్నారు.. అది ఇప్పటికీ కాలేదు.

సిద్దిపేట జిల్లాలో 22వేల మంది రైతులకు రూ.300కోట్ల రుణమాఫీ పెండింగ్‌లో ఉంది. ఒక నర్మెట్టలోనే 350మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మా నియోజకవర్గంలో రుణమాఫీ అయ్యింది 48 శాతం, కానిది 52 శాతం. మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టారు. నేడు ఏ రైతు బంధు ఇస్తున్నారో రేవంత్ తెలపాలి అని హరీష్ రావు అన్నారు.

# బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ చలో అసెంబ్లీ

- అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్
- ప్రజలకు తెలిసేందుకే కార్యక్రమం
- రాజీవ్ ఆరోగ్యశ్రీ ప్రజలకు అందడం లేదు
- నిరుద్యోగులకు బీజేపీ అండ
- ఎమ్మెల్సీ మల్క కొమురయ్య



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బడ్జెట్ ను నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో మార్చి 23వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమానికి అధిష్టానం సూచన మేరకు పిలుపునిచ్చారని బిజెపి ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య తెలిపారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2026--27 వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు, రెవెన్యూ అంచనాలు, వాస్తవ ఖర్చుల మధ్య స్పష్టత లేకుండా గందరగోళంగా ఉందని ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య ఆరోపించారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యా రంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు. మేము ఎప్పటికప్పుడు 15% కేటాయించాలని డిమాండ్ చేస్తుంటే, కేవలం సుమారు 8% మాత్రమే ఇచ్చారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 14% నుంచి 18% వరకు కేటాయింపులు ఉంటాయి. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి ముఖ్య రంగాల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు తీసుకురావడాన్ని గొప్పగా చెప్పుకుంటోంది. కానీ కేంద్ర పథకాలను తమవిగా ప్రచారం చేసుకుంటోంది. మ్యాచింగ్ ఫండ్స్ ఇవ్వలేక, సరైన సమన్వయం లేక అనేక పథకాలు నిలిచిపోతున్నాయి. సోలార్ పంపుల వంటి పథకాలలో కూడా రాష్ట్రం వెనుకబడిందన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు సరిగా అమలు కావడం లేదు. రిటైర్డ్ ఉద్యోగులకు కూడా బకాయిలు చెల్లించలేని పరిస్థితి ఉంది. ఏ శాఖను చూసినా సమస్యలే కనిపిస్తున్నాయి. పేదలకు ఇండ్ల నిర్మాణం నుంచి రైతుల సమస్యల వరకు ప్రతి రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, వైఫల్యాలకు నిరసనగా మార్చి 23న బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపడుతాం అన్నారు. అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్ , పలువురు బిజెపి రాష్ట్ర నాయకులు కొప్పు భాష తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 19న "మాస్"జన జాతర

- బీసీ మేధావులతో ప్రజలను చైతన్య పరిచే పోరాటం
- గ్రామ గ్రామాన తిరిగి బీసీ ఉద్యమాన్ని పటిష్టం చేస్తాం
- బీసీ రాజ్యాధికారాన్ని సాధించేలా గల్లీ నుంచి ఢిల్లీ వరకు కొట్లాట
- మన ఆలోచన సాధన సమితి అధ్యక్షులు కటకం నర్సింగరావు




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బీసీ ఉద్యమాన్ని మరింత పటిష్టం చేసేందుకు మన ఆలోచన సాధన సమితి నిరంతరం పోరాటం చేస్తుందని మన ఆలోచన సాధన సమితి "మాస్" వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగరావు అన్నారు.

శనివారం రాబోయే నెలలో రాష్ట్ర రాజధానిలో నిర్వహించ తలపెట్టిన బీసీ జన జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని వర్గాలతో మమేకమవుతున్నమన్నారు.

ఈ సందర్భంగా మన ఆలోచన సాధన సమితి మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగరావు మాట్లాడుతూ గ్రామ గ్రామాన బీసీ ఉద్యమాన్ని మరింత పటిష్టం చేస్తామని, బీసీ మేధావులతో విజ్ఞులతో సలహాలు తీసుకొని బీసీ ఉద్యమాన్ని జాగృతం చేస్తామన్నారు. గల్లీ నుండి ఢిల్లీ స్థాయి వరకు ఉద్యమాన్ని నిర్మించే కార్యక్రమంలో భాగంగా గ్రామ గ్రామాన్ని సందర్శించి బీసీ కులాలలోని అన్ని వర్గాల ప్రజలను చైతన్య పరుస్తామని అన్నారు. తాము నిర్వహించ తలపెట్టిన బీసీ జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వేలాదిగా బీసీలందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు.

మన ఆలోచన సాధన సమితి( మాస్) ఆధ్వర్యంలోనాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరగబోయే బీసీ జన జాగరణ జాతర కార్యక్రమం ఏప్రిల్ 19వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2:00 గంటలకు నిర్వహించబడునని మన ఆలోచన సాధన సమితి "మాస్" వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు తెలిపారు. బీసీ జన జాగరణ జాతర కార్యక్రమం జయప్రదం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సలహాలు, సూచనలు అభిప్రాయాలుఅడిగి తెలుసుకున్నారు.

ఈ బీసీ జన జాగరణ జాతర కార్యక్రమానికి వేలాదిమంది బీసీ ఇంటెలెక్చువల్స్, మేధావులు, జర్నలిస్టులు ఉద్యమకారులు, విద్యావంతులు, కవులు, రచయితలు, బీసీ యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనే అవకాశం ఉన్నందున ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సమావేశంలో నిర్ణయించారు.గ్రామాలలో, పట్టణాలలో, మండలాలలో జిహెచ్ఎంసి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బీసీ నాయకులు పాల్గొని జన జాగరణ జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గడ్డం నరసింహ గౌడ్ పూస నర్సింహ, ఉపాధ్యక్షులు కోల భాస్కర్, ఆవుల వెంకట్ యాదవ్, మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర పోల్కం బాల నారాయణ మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిలు కొంపోజు నరహరి చారి పెదవూర బ్రహ్మయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో 18 శాతానికి బదులు 8.22 శాతమే కేటాయింపు

- ఉద్యోగ, విశ్రాంత వర్గాలకు తీరని అన్యాయం
- టిపిటిఎఫ్ మాజీ అధ్యక్షుడు వై అశోక్ కుమార్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన రూ. 3,24,234 కోట్ల వార్షిక బడ్జెట్ అంకెల గారడీ తప్ప, క్షేత్రస్థాయిలో సామాన్యుడికి, ముఖ్యంగా విద్య మరియు ఉద్యోగ వర్గాలకు ఒనగూర్చే ప్రయోజనం ఏమీ లేదని విద్యా పరి రక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షులు టి పి టి ఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు వై. అశోక్ కుమార్ అన్నారు. రాష్ట్ర విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విద్యా కమిషన్ బడ్జెట్‌లో కనీసం 18 శాతం నిధులను కేటాయించాలని నివేదిక ఇచ్చినా, ప్రభుత్వం దానిని పూర్తిగా బేఖాతరు చేస్తూ కేవలం 8.22 శాతం నిధులతో సరిపెట్టడం గమనార్హం.

కమిషన్ సిఫార్సుల ప్రకారం సుమారు రూ. 58,362 కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ. 26,674 కోట్లు మాత్రమే కేటాయించడం ప్రభుత్వ పాఠశాలలు మరియు విశ్వవిద్యాలయాల అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది. అరకొర నిధులతో మౌలిక వసతుల కల్పన, కొత్త ఉపాధ్యాయ నియామకాలు ఏ విధంగా సాధ్యమవుతాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని వరన్నారు.

అదేవిధంగా, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు విశ్రాంత ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరించడం శోచనీయం. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ లు, పీఆర్సీ అమలు, ఇతర బకాయిలు మరియు మార్చి 2024 నుండి ఉద్యోగ విరమణ చేసిన వారి రిటైర్మెంట్ బకాయిలు గురించి ఈ బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేకపోవడం సుమారు 2.5 లక్షల విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలను తీవ్ర నిరాశకు గురిచేసింది.

వృద్ధాప్యంలో ఉన్న విశ్రాంత ఉద్యోగుల ప్రాణాలకు భరోసా ఇవ్వాల్సిన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈ హెచ్ ఎస్) పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. ఈ బడ్జెట్‌లో ఈ హెచ్ ఎస్ కోసంకేటాయించిన రు.1056 కోట్ల ప్రత్యేక నిధులు ఏమాత్రం సరిపోవనేది సత్యం. నిధుల కొరతతో కార్పొరేట్ ఆసుపత్రులు నగదు రహిత చికిత్సను నిరాకరిస్తున్న తరుణంలో, ఈ బడ్జెట్ ద్వారా ఉద్యోగ వర్గాల వైద్య అవసరాలను తీర్చడం కోసం కేటాయించిన స్వల్ప నిధులతో సరిపెట్టడం దారుణం అని అన్నారు.

రాష్ట్ర ఆదాయంలో అధిక భాగం అప్పులు, వడ్డీల చెల్లింపులకే వెళ్తున్న క్రమంలో, సంక్షేమం మరియు అభివృద్ధి పేరిట ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, విద్య, ఉద్యోగుల సంక్షేమం వంటి మౌలిక అంశాలను విస్మరించడం ఆందోళనకరం. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి, విద్యా కమిషన్ సూచించిన విధంగా నిధులను 18 శాతానికి పెంచాలని, ఈ హెచ్ ఎస్ ద్వారా సంపూర్ణ నగదు రహిత వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఉద్యోగ బకాయిలను తక్షణమే విడుదల చేసి ఉద్యోగుల ఆర్థిక భద్రతను కాపాడాలని కోరారు.

# సగరులను బీసీడి నుండి ఏలో చేర్చాలి

- ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చాలి
- రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర డిమాండ్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : సగర కులాల జీవితాల్లో వెలుగులు రావాలంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం సగర ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చాలని తెలంగాణ సగర సంఘం డిమాండ్ చేసింది. శనివారం బాగ్‌లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సగర సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ సగరులను బీసీ డి గ్రూప్ నుండి ఏ లోకి మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తు ఈ సమావేశంలో తీర్మానించామన్నారు. అలాగే ఆర్థికంగా, రాజకీయంగా సమాజికంగా వెనక బాటుకు గురైన సగరులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరామన్ కమిషన్, మురళీధర్ రావు కమిసన్ కు సమర్పించిన నివేదిక ప్రకారం సగరులను ఆదుకోవాలన్నారు. అవసరమైతే బీసీ కమిషన్‌ను కూడా మార్చి ఫెడరేషన్‌గా చేయాలని కోరుతున్నామన్నారు. మా కులానికి సంబంధించిన జీవన గతులపై ఇప్పటికీ కూడా ఉమ్మడి ఏపిలో ఉన్న విధంగా ఫెడరేషన్ ఉందని, దానిని ఆ పాలకులు కొనసాగిస్తున్నారని, తెలంగాణలోనూ అలాగే ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం తక్షణమే తమను ఫెడరేషన్ నుండి కార్పొరేషన్‌గా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# ఆరు గ్యారంటీలు చట్టమైతే అన్నివర్గాలకు లాభం

- చట్టబద్ధత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వ్యాఖ్యానించారు. ఈ విషయంలో అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి చైర్మన్‌ను కలుస్తామని తెలిపారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల బిల్లుకు మద్దతు కోసం అన్నిపార్టీలకు లేఖలు రాస్తామని చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఏపీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిన చరిత్ర అసెంబ్లీకి ఉందని ప్రస్తావించారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. బీజేపీ ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టిందని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును బీజేపీ వ్యతిరేకించినా ఇబ్బంది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం కోటి మోసాలు చేసిందని ధ్వజమెత్తారు. ప్రజల నుంచి ఓట్లు రాబట్టడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల హామీల అమలు చట్టం ఫైల్‌పై సంతకం చేశారని ఉభయ సభల్లో గత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తన ప్రసంగంలో చెప్పారని ప్రస్తావించారు.

**కాంగ్రెస్ హామీలు పెద్ద ఫ్రాడ్..**

840 రోజులు అయినా ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయట్లేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు పెద్ద ఫ్రాడ్ అని ఎద్దేవా చేశారు. సీఎం సంతకం చేసిన ఫైల్ ఎందుకు దొరకడం లేదని నిలదీశారు. ఈ ఫైల్ ఢిల్లీ విమాన ప్రయాణంలో పోయిందా..?, ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదంలో కాలిపోయిందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ సర్కార్ ఇంకా ఒక బడ్జెట్ మాత్రమే ప్రవేశపెట్టాల్సి ఉందని.. ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు చట్టమైతే అన్నివర్గాలకు లాభం కలుగుతుందని చెప్పుకొచ్చారు. ప్రజల తరఫున ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడుతున్నామని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

# హుజూరాబాద్ బీఆర్ఎస్‌లో సెగలు

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతల తిరుగుబాటు
- కౌశిక్ రెడ్డి నిర్ణయాలు, వ్యవహారశైలిపై విసిగిపోయిన నేతలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. గత కొంత కాలంగా కౌశిక్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు, వ్యవహారశైలిపై విసిగిపోయిన స్థానిక నేతలు, అనుచరులు త్వరలో పార్టీకి గుడ్ బై చెప్పబోతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే భవిష్యత్ కార్యాచరణపై జమ్మికుంటలో రహస్య సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో సుమారు వందమందికిపైగా పాల్గొన్నట్లు సమాచారం. ఈ పరిణామాలు నియోజకవర్గ రాజకీయాల్లో పెను సంచలనంగా మారాయి. శుక్రవారం రాత్రి జరిగిన రహస్య సమావేశంలో పలువురు నేతలు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యవహార శైలిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవల కౌశిక్ రెడ్డి నిర్ణయాల వల్ల నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడే వారిని కాదని, తన సొంత అజెండాను అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరం కలిసికట్టుగా ఉండి పార్టీని, తమ రాజకీయ భవిష్యత్ ను కాపాడుకుంటామని తీర్మానించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ ముసలం కాస్త పార్టీ ఫిరాయింపుల వైపు దారితీసేలా కనిపిస్తోంది. ఇప్పటికే అసంతృప్తి నేతలు కొందరు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. త్వరలోనే జిల్లా మంత్రి సమక్షంలో భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు హస్తం గూటికి చేరే అవకాశం ఉందని అంటున్నారు. మరి ఈ వ్యవహారంపై గులాబీ బాస్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

# పులి బక్కపడినా...చారకలు పోవు

- రక్తం చిందించి, కొట్లాడి, ఇష్టపడి తెచ్చుకున్న తెలంగాణ
- ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ముందుకు వెళ్తా
- ఎంపీ ఈటల రాజేందర్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: పార్టీలు సిద్ధాంతాలు వేరు కావచ్చు కానీ సమాజ హితం కోరుకున్న వారు చాలా మంది వచ్చారు. అందుకు తాను గర్వపడుతున్నా. మాలాంటి వారికి శక్తి ప్రజలే ప్రసాదిస్తారు అనడానికి ఇది ఒక గొప్ప నిదర్శనం అని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కులాలు మతాలు పార్టీలతో సంబంధం లేకుండా మానవత్వం సంబంధంతో అనేకమంది ఈ రోజు నా దగ్గరికి వచ్చారన్నారు.జడ్చర్ల నుంచి కొంతమంది సోదరుల వచ్చారు, మీ కోసం ఎదురు చూస్తున్నామన్న అని చెవిలో చెప్పి వెళ్లారన్నారు. నాయకుడికి డిగ్నిటీ ఉండాలి. నాయకుడు తన చరిత్రను హోదాను బట్టి సమాజంలో ఉన్న ప్రతిష్టను బట్టి వ్యవహరించాలి తప్ప భిన్నంగా వ్యవహరించకూడదు. అలా వ్యవహరిస్తే తప్పయితుంది.ఎవరో మాట్లాడుతున్నారని మనం కూడా మాట్లాడాలని పోకడలు వస్తూ ఉంటాయి. స్పందించకపోతే ఆలోచించటం లేదు అని మాత్రం అనుకోవద్దు. ప్రతి దానికి పరిష్కారం ఉంటుందన్నారు.ఎన్నో దెబ్బలు తగిలాయి అనేక గాయాలు అయ్యాయన్నారు.మాతో పెట్టుకోవడం అంటే ధర్మంతో పెట్టుకున్నట్టే అని అనేకసార్లు చెప్పాను. మేము ఒకరి మేలుకోరే వారం తప్ప కీడు కోరే వారం కాదన్నారు. కెసిఆర్ మాత్రమే ఉద్యకారుడు, కేసీఆర్ మాత్రమే ప్లాన్ చేస్తారని చాలామంది అనుకుంటారు కానీ ఉప్పల్ రైల్వే పట్టాల మీద కాల్పులకు ఆదేశాలు జారీ చేసినా కూడా కాల్చుకో పోరా.. అని వెనుకడుకు వేయకుండా ఉద్యమించిన గడ్డ హుజురాబాద్. మానుకోటలో రక్తం చిందినా చీమల బారుల్లాగ ఎదిరించిన వారిలో నేను ఉన్నానన్నారు.ఎప్పుడు ఎలా మాట్లాడాలో తెలుసుకున్నారు.

మీరు రాసిన పాటలు, పాడిన గీతాలు, వేలాదిమంది ఆశీర్వాదాలు అని అన్నారు. వృధా మాత్రం పోవు. మేము డబ్బులు సంపాదించుకోవడం కోసం రాజకీయాలకు రాలేదు వ్యాపారంలో ఉండి రాజకీయాల్లోకి వచ్చాము.అప్పట్లోనే ఈటలతో పెట్టుకోవద్దని చాలెంజ్ చేసేవాడిని. పులి బక్కపడ్డ పులి చారకలు పోవు అని అన్నారు.అవమానాలనుండి అణిచివేతనల నుండి అనేక ఘర్షణలు వస్తాయి.ఘర్షణలనుంచి మార్పు వస్తుంది.ఆ ఘర్షణల నుంచి ప్రజలకి మేలు జరుగుతుందని నమ్మేవాడి అని అన్నారు. కులానికి మతానికి ఒక నియోజకవర్గానికి మాత్రమే పరిమితం కాకుండా తెలంగాణ యావత్ ప్రజలు ప్రేమించే బిడ్డగా ఉన్నానన్నారు. తెలంగాణ ప్రజల ఆలోచన ఏముంటుందో నా ఆలోచన కూడా అదే ఉంటుందన్నారు. తెలంగాణ ప్రజల ఆలోచన ఆరాటం సఫలం అయ్యేవిధంగా మా కార్యాచరణ ఉంటుందన్నారు. పదవుల కోసం పెదవులకు మూసే వాళ్ళం కాదని, ప్రలోభాలకు తలొగ్గే వాళ్ళం కాదని ఇప్పటికే నిరూపించుకున్నాం అని అన్నారు. ఉన్నంత కాలం ప్రజల పక్షాన ధర్మం న్యాయం పక్షాన ఉంటామని హామీ ఇచ్చారు.




## ఎట్టి పరిస్థితుల్లో ఆ ప్రాంతాలను టచ్ చేయం

- ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కచ్చితంగా కూల్చివేస్తాం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్



తెలంగాణ బ్యూరో ప్రతినిది : ప్రభుత్వ భూములు కబ్జా చేసి ఫామ్‌హౌజ్‌లు కడితే కచ్చితంగా కూల్చివేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. శనివారం ఆయన ఓ మీడియా ఛానల్ ప్రతినిధితో మాట్లాడారు. మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి ఫామ్‌హౌజ్ ఎఫ్టీఎల్ లో లేదని తెలిపారు. జంగంకుంట కబ్జా వెనుక చాలా పెద్దవారు ఉన్నట్లు మాకు సమాచారం వచ్చింది. అయినా వదిలిపెట్టం. మా డ్యూటీ మేము తప్పకుండా చేసి తీరుతాం. ఇక దుర్గం చెరువు విషయానికొస్తే.. హైడ్రా అనే వ్యవస్థ రాకముందే అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. నల్లకుంట, మసాబ్ ట్యాంక్, కృష్ణానగర్‌లోనూ కబ్జాలు ఉన్నాయి. అన్నింటిపైనా ఫోకస్ పెట్టాం. కబ్జాకారులు ఎవరినీ వదిలిపెట్టం. ప్రజలు నివసించే ప్రాంతాలను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో టచ్ చేయం అని రంగనాథ్ స్పష్టం చేశారు.

**అందరికీ భయం ఉండాలి..**

హైడ్రా దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. హైడ్రాకు రెఫరెండంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరిగింది. తమపై ఆరోపణలు చేసిన వారికి ఫలితాలు భిన్నంగా వచ్చాయి. రాష్ట్రంలో ఇళ్లు కోల్పోయిన పేదలు అందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సంకల్పించింది. ఇప్పుడు కాకపోయినా.. ఎప్పుడో ఒకరోజు అందరూ హైడ్రాను మెచ్చుకోక తప్పదు. దాంతో పాటు ఫ్రెండ్లీ పోలీసింగ్ కాదు.. తప్పు చేస్తే భయం ఉండాలి అని రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

## మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి షాక్..




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బీఆర్ఎస్ నేత, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌పై జరిగిన పోలీసుల దాడి, తదనంతర పరిణామాలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్ పరిధిలో ఉన్న రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌పై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కార్యాకలాపాలకు నిలయంగా మారిందనే పక్కా సమాచారంతో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. మొయినాబాద్ పోలీసులు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ నిర్వహించిన సమయంలో ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి హాజరైన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఫామ్‌హౌస్‌ను అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ నిర్మాణం చుట్టూ అనేక చట్టపరమైన చిక్కులు ఉన్నాయి. అజీజ్‌నగర్‌లోని సర్వే నంబర్ 177/33లో సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఫామ్‌హౌస్ నిర్మించారు. ఈ భూమిని 2006లో రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డుల్లో ఉంది. అయితే, ప్రభుత్వ 'భూభారతి' రికార్డుల్లో ఈ భూమి జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు గుర్తించారు.

రంజాన్ పండగ వేళ

## తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ప్రార్థనలు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: దేశవ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అల్లాహ్‌ను స్మరించుకుంటూ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ రంజాన్ శోభ కనిపిస్తోంది. పవిత్ర దినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్, విజయవాడ, వరంగల్, విశాఖ సహా గ్రామగ్రామాన ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వందలాది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. అలాగే పాతబస్తీ, యనమలకుదురు ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల్లో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, టీడీపీ నేత నాగుల్ మీరా, బీజేపీ నేత సయ్యద్ బాషా, వైసీపీ నేత దేవినేని అవినాశ్ పాల్గొన్నారు. ఇక హైదరాబాద్ నగరం సైతం రంజాన్ వేడుకలకు సిద్ధమైంది. ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు సిద్ధమవుతున్నారు ముస్లిం సోదరులు. చరిత్రాత్మక మక్కా మసీదులో రంజాన్ వేడుకలు ఇవాళ(శనివారం) ఉదయం 10గంటలకు ప్రారంభంకానున్నాయి. మక్కా మసీదులో భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ ప్రార్థనలు చేయనున్నారు. పాతబస్తీలో రద్దీని దృష్టిలో ఉంచుకుని మక్కా మసీదు పరిసరాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. మక్కా మసీదులో ప్రత్యేక ఈద్ ప్రార్థనలు, భారీ ఇఫ్తార్ విందుల కోసం పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అలాగే మీరాలం ట్యాంక్ వద్ద ఉన్న ఈద్గాకు పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరుకుంటున్నారు. మరికొద్దిసేపట్లో సామూహిక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. మీరాలం ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్, క్విక్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లతో భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీ నేపథ్యంలో మీరాలం పరిసర ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉండనున్నాయి. ఈనెల 19న నెలవంక కనిపించకపోవడంతో భారతదేశంలో రంజాన్ పండుగ నేడు జరుపుకుంటున్నారు.

## మోదీ పాలనలో ఆరోగ్య వికాసం

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి



హైదరాబాద్ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కాలంలోనే అఖిల భారతం ఆరోగ్య పరంగా వికసించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ శిశు మరణాల తగ్గింపులో అఖండ భారతం చారిత్రక విజయం సాధించినట్లు కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అయితే, ఐదేళ్ల లోపు చిన్నారుల మరణాలు 79 శాతం తగ్గినట్టు, నవజాత శిశు మరణాలు 70 శాతం తగ్గినట్లు కిషన్ రెడ్డి ఎక్స్ వేదికపై తెలియజేశారు. గత 1990 దశకంతో పోల్చుకుంటే ఆరోగ్య భారత్ దిశగా పడుతున్న అడుగులు నేపథ్యంలో గణనీయమైన మార్పు చోటు చేసుకుందన్నారు. తల్లి బిడ్డల మరణాలు తగ్గుముఖం పట్టాయన్నారు. 1990లో ప్రతి 1000 మంది నవజాత శిశువులు 57 మంది మృత్యువాతపడుతుండగా, 2024లో 70 శాతం తగ్గి, 16.7గా నమోదయ్యిందన్నారు. కాగా ఐదు సంవత్సరాల లోపు పిల్లల మరణాల రేటు 1990లో 127 గా ఉండగా, అది ప్రస్తుతం 79 శాతానికి తగ్గి 2024లో 26.6గా నమోదయింది. ఇది కేవలం మోడీ ప్రభుత్వం సమర్ధ పాలనకు నిదర్శనంగా ఆయన చెప్పుకొచ్చారు. బాలింతలు, తల్లి బిడ్డల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు ప్రస్తుతం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# నల్గొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా

- బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుతో ప్రతి ఎకరానికి సాగునీరు
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిది : నల్లగొండ జిల్లా బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా నల్లగొండ నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు అన్నారు. శనివారం నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామంలో ద్విచక్ర వాహనం నడుపుతూ బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి వచ్చే సాగునీటి కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కొండపాక గూడెం నుంచి అప్పాజీపేట వరకు నూతనంగా ఏర్పాటు చేసే పిల్ల కాలువ నిర్మాణ పనులకు అప్పాజీపేటలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్రాహ్మణవెంలం ప్రాజెక్టు మంచి కాలువల ద్వారా నల్గొండ నియోజకవర్గంలోని చెరువులన్నింటిని నింపి ప్రతి ఎకరానికి సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. నల్గొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే తన ధ్యేయమని తెలిపారు. బ్రాహ్మణవల్ల ప్రాజెక్టు నియోజకవర్గ ప్రజలకు వరం లాంటిదని, ఈ ప్రాజెక్టు నుంచి వచ్చే కాలువ నీటి ద్వారా రైతులందరిలో సంతోషం వెల్లువిరుస్తుందని తెలిపారులి

**నల్లగొండ నియోజకవర్గం**

తనకు గుండెకాయ లాంటిదని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానని అన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు తో భూగర్భజాలాలు పెరగడంతో పాటు కాలుల ద్వారా గ్రామంలో ప్రతి చెరువును నింపడం జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుందని అన్నారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని అన్నారు.

అప్పాజీపేట గ్రామంలో పిల్లకాలువ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గంగుల అండాలు సైదులు,ఇరిగేషన్ ఈఈ సతీష్ చంద్ర,డిఈ పిచ్చయ్య, ఏఈ నవీన్ కుమార్, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, మాజీ జడ్పిటిసిలు పాశం, రామ్ రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, డిసిసిబి మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, అప్పాజీపేట మాజీ సర్పంచ్ గంగుల సైదులు, ఉప సర్పంచ్ పోలే సతీష్,రాపర్తి సతీష్,అయితగోని శేఖర్, కట్ట అంజయ్య ,కాసర్ల బిక్షపతి, గంగుల నరేందర్, నందిపాటి అశోక్ ,ఐతరాజు గణేష్, కాసర్ల సురేందర్ రెడ్డి,జాల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# భద్రాచలం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం,పట్టణ సమగ్ర అభివృద్ధిపై సమీక్షలో మంత్రి కొండా సురేఖ

తెలంగాణ బ్యూరో ప్రతినిది : భద్రాచలం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మరియు పట్టణ సమగ్ర అభివృద్ధి పై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన చాంబర్లో కొండా సురేఖ అధ్యక్షతన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జాటోత్ రామచంద్ర నాయక్ లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. "భద్రాచలం పునర్నిర్మాణం మరియు పునరుజ్జీవనం" ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళికల పై చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం దేశవ్యాప్తంగా భక్తుల విశ్వాసానికి నిలయమని, ఆలయం, పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. యాత్రికుల సౌకర్యాల మెరుగుదల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పార్కింగ్ సదుపాయాలు, రహదారుల విస్తరణ, పరిశుభ్రత పరిరక్షణ వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. మాడ వీధుల అభివృద్ధి, కళ్యాణ మండపం నిర్మాణం, రామవనం అభివృద్ధి, డిజిటల్ ఇన్ఫర్మేషన్ సెంటర్లు, తాగునీటి సరఫరా, శుభ్రమైన మరుగుదొడ్ల ఏర్పాటు వంటి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

ఈ నెల 27న జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. కళ్యాణ మండపాన్ని ఆకర్షణీయంగా అలంకరించడంతో పాటు లైటింగ్, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను సమృద్ధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం బ్యాటరీ వాహనాలు అందుబాటులో ఉంచాలని, అగ్నిమాపక చర్యలు, అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ ఇతర అధికారులు, ప్రాజెక్టు రూపకర్తలు, సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.


# మీ మాట నేను వినా

- పార్టీ మారడం ఖాయం
- ఏ పార్టీలో మారుతారో తెలియని వైనం
- జీవన్ రెడ్డి పార్టీ మారతారంటూ ఊహగానాలు
- జీవన్ రెడ్డితో ముగిసిన మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌ల భేటీ

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌ల భేటీ ముగిసింది. పార్టీ పెద్దల తీరుపై గత కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్న జీవన్ రెడ్డి.. కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి.. బీఆర్ఎస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో జీవన్ రెడ్డిని కలిసిన మంత్రులు.. ఆయనను బుజ్జగించే ప్రయత్నం చేశారు. చాలా సమయం జీవన్ రెడ్డితో చర్చలు జరిపిన మంత్రులు.. పార్టీలో ఆయనకు సముచిత ప్రాధాన్యం దక్కేలా అధిష్ఠానం చూసుకుంటుందని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే, వీరి బుజ్జగింపులు సఫలీకృతం అయినట్లుగా కనిపించడం లేదు. జీవన్ రెడ్డితో భేటీ అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. పార్టీ మారే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని జీవన్ రెడ్డిని కోరామని మంత్రి తెలిపారు. జీవన్ రెడ్డికి పార్టీ అండగా నిలబడే ఆలోచన చేస్తుందన్నారు. ఆయనతో చర్చించిన అంశాలను పార్టీ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. జగిత్యాల ప్రాంతానికి జీవన్ రెడ్డి పెద్దదిక్కు అని.. అభివృద్ధి కోసమే 10 మంది ఎమ్మెల్యేలను తీసుకున్నామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. జీవన్ రెడ్డి గురించి తెలంగాణ రాష్ట్రంలో తెలియని వారు ఎవరూ ఉండరన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గొంతుకగా ఉన్న నాయకుడు జీవన్ రెడ్డి అని అన్నారు. జీవన్ రెడ్డి బాధపడితే తాము బాధపడినట్లేనని అన్నారు. కాంగ్రెస్ నాయకులు మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు జీవన్ రెడ్డితో గతంలో మాట్లాడారని మంత్రి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను జీవన్ రెడ్డి తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ వివరాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి చెప్పారు.

**జీవన్ రెడ్డి ఆగ్రహం..**


తన పట్ల పార్టీ పెద్దలు అనుసరిస్తున్న వైఖరిపై మంత్రుల వద్ద జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇన్ని అవమానాలు ఎదుర్కొంటూ పార్టీలో ఇంకా ఎందుకు కొనసాగాలని మంత్రులను ప్రశ్నించారు జీవన్ రెడ్డి. పార్టీలో గౌరవం లేనప్పుడు ఎందుకు ఉండాలని నిలదీశారు. దీంతో మీ సమస్యకు పరిష్కారం ఏంటని జీవన్ రెడ్డిని ప్రశ్నించారు మంత్రులు. స్పందించిన జీవన్ రెడ్డి.. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలను పక్కన పెట్టడమే తన సమస్యకు పరిష్కారమని మంత్రులకు తేల్చి చెప్పారు. ఇన్ని అవమానాలు భరిస్తూ పార్టీలో ఎందుకు ఉండాలని అడుగుతున్న తన కుమారులకు ఏం సమాధానం చెప్పాలని మంత్రులను అడిగిన జీవన్ రెడ్డి.. సారీ చెప్పి సమావేశాన్ని ముగించేశారు.




# గరికపాటిపై ఆర్ఎస్పీ సంచలన వ్యాఖ్యలు

- చంచల్‌గూడ 'అండా' సెల్‌లో వేయాలని డిమాండ్
- 'మధ్యాహ్న భోజన పథకం'పై వ్యాఖ్యల దుమారం

తెలంగాణ బ్యూరో? ప్రతినిది : ప్రముఖ ప్రవచనకర్త, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు 'మధ్యాహ్న భోజన పథకం'పై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదస్పదానికి దారితీశాయి. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పై గరికపాటి చెప్పిన మాటలు ఓ వీడియో చక్కర్లు కొడుతోంది. ఈ వీడియోపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. నెటిజన్‌లు గరికపాటిపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ నేత, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ శనివారం ఎక్స్ వేదికగా స్పందించారు. గరికపాటి తన మనసులో మాటను చెప్పాడని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. నిజానికి ఈ సమాజంలో చాలామంది ఆధిపత్య వర్గాల పెద్దలకు-మేధావులకు తరతరాలుగా పేద వారి చదువులు, తినే తిండి మీద గరికపాటి లాంటి చులకన భావమే ఉంటుందని, దీనికి నా వద్ద వందల ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు.



**వాళ్లు నటిస్తారు, ఈయన నటించలేదు..**

అయితే, వాళ్లు నటిస్తారు, ఈయన నటించలేదని అన్నారు. అందుకే పేదరికం వివక్ష అనేవి ఈ దేశంలో నేటికీ పోవడం లేదని, రోహిత్ వేముల లాంటి వారు బలవుతూనే ఉన్నారని ఆవేదన చెందారు. గరికపాటి గడ్డి మాటలే కాదు, ఆయన అట్లా కడుపు నిండిన ప్రవచనాలు చేస్తుంటే చప్పట్లు కొడుతున్న మూర్ఖులను చూసి జాలి వేస్తున్నదని సంచలన వ్యాఖ్యలు చేశారు. మొన్న దళిత ఎమ్మెల్యే మందుల సామేలు ఇంటి మీద కోడి గుడ్ల దాడి చేసిన బండి సంజయ్ - బీజేపీ గ్యాంగ్ ఇప్పుడు బ్రాహ్మణ వర్గానికి చెందిన గరికపాటి ఇంటికి పోతరా? ముమ్మాటికీ పోరు.. అని ఆర్ఎస్పీ విమర్శించారు. 'మీరు చూస్తూ ఉండండి.. పోలీసులు కూడా కేసులు పెట్టరు.. జాతీయ బాలుర సంఘం, మానవ హక్కుల సంఘం ఇతనిని పిలవను కూడా పిలవదు' అని అభిప్రాయం తెలిపారు. 'పేద పిల్లలు పోషకాహారం తినకుండా అస్థిపంజరాలుగా మారి, వీళ్ల జెండాలు మోసే రోబోలుగా మారి గరికపాటి లాంటి వారి ప్రసంగాలకు చప్పట్లు కొడుతూ, ఓట్లేస్తూ ఉంటే చాలు.. గరికపాటి, అతని లాంటి వారిని కేసు పెట్టి చంచల్ గూడ 'అండా' సెల్ లో వేయాలి.. అప్పుడే తెలుగు రాష్ట్రాల్లో విజ్ఞానం వికసిస్తుంది' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

# ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ


చెన్నూరులో మంత్రి వివేక్ వెంకటస్వామి



తెలంగాణ బ్యూరో ప్రతినిది : పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడైనా ముస్లిం మైనార్టీలను పట్టించుకోలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూరులో పర్యటించిన మంత్రి .. ముస్లిం మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కుట్టుమిషన్లు ఆర్థికంగా చేయూతకు తోడ్పాడునందిస్తాయన్నారు. మైనార్టీల అభివృద్ధికోసం తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. 2026 రాష్ట్ర బడ్జెట్ లో ఇందిరమ్మ ఇళ్లకు రూ. 5వేల కోట్లు కేటాయించామన్నారు మంత్రి. సొంత జాగా ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామన్నారు. అంతకుముందు మంచిర్యాల జిల్లా మందమర్రిలో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. వారికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన.. ఈద్గా, దర్గాలలో మౌళిక సదుపాయాల కల్పన కు కృషి చేస్తామన్నారు. మందమర్రిలో రు. 50లక్షలతో షాదిఖానా, ఈద్గా వద్ద కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసేందుకు పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. సింగరేణి సంస్థతో మాట్లాడి మందమర్రి ఈద్గా వద్ద కమాన్ ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ సెక్యూలర్ పార్టీ అని, ముస్లింలకు అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. మందమర్రి, రామకృష్ణాపూర్ పట్టణాల్లోని పలు ముస్లింల ఇండ్లలో షేమియాను మంత్రి సేవించారు. మంత్రి వెంట డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, మైనార్టీ నేతలు అబ్దుల్ అజీజ్, యాకుబ్ అలీ ఉన్నారు.

# ఎమ్మెల్యే దానంకు బిగ్ షాక్

- హైకోర్టుకు చేరిన వివాదం
- సోమవారం ఏం జరుగుతుందోనని ఉత్కంఠ?



తెలంగాణ బ్యూరో ప్రతినిది : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వేటు విషయంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు న్యాయస్థానానికి చేరింది. దానం నాగేందర్ పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ పార్టీ మారలేదన్న స్పీకర్ నిర్ణయాన్ని తక్షణమే క్వాష్ (రద్దు) చేయాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తన పిటిషన్‌లో కోరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ తరపున సికింద్రాబాద్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన విషయాన్ని పిటిషన్‌లో ప్రస్తావించారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి, మరో పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయడం ఫిరాయింపు కిందికే వస్తుందని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు.

**అనర్హత వేటు..**

నామినేషన్ పత్రాల ఆధారంగా దానం నాగేందర్‌పై తక్షణమే అనర్హత వేటు వేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. పార్టీ మారిన తర్వాత కూడా ఎమ్మెల్యేగా పొందుతున్న జీతాన్ని, ఇతర భత్యాలను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు స్వీకరించింది. దీనిపై సోమవారం (మార్చి 23) విచారణ జరిగే అవకాశం ఉందని సమాచారం. గత కొంతకాలంగా తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపులపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న తరుణంలో, హైకోర్టు ఇచ్చే తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలకం కానుంది.

## వచ్చే రెండు రోజులలో తేలిక పాటి వర్షాలు

వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్ : రాష్ట్రంలో వచ్చే రెండు రోజులలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. పలు జిల్లాలకు ఆరెంజ్?తో పాటు ఎల్లో అలర్ట్ జారీ చేసి హెచ్చరించింది. మేడ్చల్ మల్కాజిగిరి, నల్గొండ, యాదాద్రి భువనగిరి, జిల్లాలలో తదుపరి 2-3 గంటల్లో మోస్తరు వర్షం, గంటకు 41 - 61 కి.మీ.ల మధ్య గరిష్ట ఉపరితల గాలి వేగంతో (గాలులు వీచే) మోస్తరు ఉరుములతో కూడిన వర్షాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, జనగాం, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్ధిపేట, వికారాబాద్ జిల్లాలలో తదుపరి 2-3 గంటల్లో తేలికపాటి వర్షం, గరిష్ట ఉపరితల గాలి వేగం గంటకు 40 కి.మీ కంటే తక్కువ (గాలులలో) తేలికపాటి ఉరుములతో కూడిన వర్షాలు వచ్చే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేసి వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణలో వడగండ్ల వానలు రైతులకు భారీ నష్టం చేసింది. నిజామాబాద్ జిల్లాలోని తొమ్మిది మండలాల్లో గురువారం అర్ధరాత్రి వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. మోస్రా, చందూర్, పోతంగల్, రుద్రూర్, వర్ని, సాలూరా, భీంగల్, సిరికొండ, జక్రాన్‌పల్లి మండలాల్లో ఈదురుగాలులకు తోడు వడగండ్లు పడడంతో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వడగండ్ల వాన కారణంగా జిల్లా వ్యాప్తంగా 3,45 0ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అగ్రికల్చర్ ఆఫీసర్లు ప్రాథమికంగా అంచనా వేశారు. 2,740 ఎకరాల్లో వడ్లు రాలిపోగా, 690 ఎకరాల్లో మక్క, 20 ఎకరాల్లో జొన్న పంట దెబ్బతింది. అమ్మడానికి కల్లాల్లో రెడీగా ఉన్న ఎర్రజొన్న, ఉడికించి ఆరబెట్టిన పసుపు మొత్తం వర్షంలో తడిసిపోయింది.

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## ఎల్పీజీ ఏటీఎం


అంతే కాకుండా, విస్తరిస్తున్న ఫుడ్ డెలివరీ రంగంలో కొత్త పోటీదారులు మార్కెట్లో ప్రవేశించటం ప్రస్తుత సంస్థలపై ఒత్తిడి సృష్టిస్తుంది. ర్యాపిడో ఓన్లీ లాంటి సేవలు వినియోగదారులను ఆకర్షించడానికి తక్కువ లేదా అదనపు రుసుములు లేకుండా సేవలు అందిస్తున్నాయి, దీంతో జొమాటో మరియు స్విగ్గీ వంటి పెద్ద ప్లాట్‌ఫారమ్‌లకు ధరలను పునర్విచారించాల్సిన అవసరం కలగవచ్చు. ఈ పోటీ వాతావరణంలో, వినియోగదారులకు కూడా మరింత లాభం మరియు ఎంపికలు లభించవచ్చని తెలుస్తోంది.

వృద్ధిచెందిన ప్లాట్‌ఫారం ఫీజు డెలివరీ రంగంలో పెట్టుబడిదారుల దృష్టిని కూడా ఆకర్షిస్తోంది. కంపెనీల లాభస్వామ్యాలను నిలుపుకోవడం, ఇంధన, కార్మిక ఖర్చులు పెరుగుతున్న పరిస్థితుల్లో ఆదాయాన్ని సమన్వయంగా పరిపాలించడం ప్రధాన లక్ష్యం. అయితే, దీన్ని సమర్థవంతంగా అమలు చేయకపోతే, వినియోగదారుల అసంతృప్తి, ఆర్డర్ సంఖ్య తగ్గుదల వంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తాయి.

మరోవైపు, కొత్త ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ స్టార్టప్‌లు వినియోగదారులను ఆకర్షించేందుకు వినూత్న విధానాలు మరియు తక్కువ ఫీజు రకాలతో వస్తున్నాయి. దీని ప్రభావంగా, జొమాటో మరియు స్విగ్గీ వంటి పెద్ద కంపెనీలు మార్కెట్ షేర్ పరిరక్షణ కోసం ఆవిష్కరణలు, ప్రత్యేక ఆఫర్లు, కష్టతరమైన ప్రోమోషన్లను మరింత ప్రోత్సహించవలసి వస్తోంది. ఇది మొత్తం ఫుడ్ డెలివరీ రంగానికి వినియోగదారులకు అనుకూలమైన పరిణామాలను తీసుకురావచ్చు.




## సోషల్ మీడియాలో నిందితుల ఫొటోలా?

### ప్రజలు షేర్ చేసే ధోరణి తప్పుపట్టిన సుప్రీం



న్యూఢిల్లీ : మొబైల్ ఫోన్లలో చిత్రీకరించిన వీడియోలను ప్రజలు వెంటనే సోషల్ మీడియాలో షేర్ చేసే ధోరణిని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. అలాంటి చర్యలు పారదర్శక విచారణకు ముప్పుగా మారుతాయని ఆందోళన వ్యక్తంచేసింది. నిందితుల వీడియోలు, ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి, ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నారని ఆరోపిస్తూ సుప్రీంకోర్టులో ఒక వ్యాజ్యం దాఖలైంది. ఒక కేసు విషయంలో పోలీసుల మీడియా బ్రీఫింగ్‌పై మార్గదర్శకాలు రూపొందించాలని అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే రాష్ట్రాలను ఆదేశించింది. అందులో సోషల్ మీడియాను కూడా చేర్చాలని పిటిషన్ కోరారు.ఈ పిల్‌పై జరిగిన విచారణలో భాగంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంకెళ్లు వేసిన, తాళ్లతో బంధించిన, మోకాళ్లపై కూర్చోబెట్టిన నిందితుల ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాలో షేర్ చేయడం ఆ వ్యక్తి గౌరవానికి భంగం కలిగించడమే అవుతుందని, అది ప్రజల ఆలోచనను ప్రభావితం చేస్తుందని పేర్కొంది. “నిబంధనల ద్వారా పోలీసులను నియంత్రించడానికి వీలు ఉంటుంది. కానీ సోషల్ మీడియా, ప్రజల సంగతేంటి..? వారిని నియంత్రించగలమా..?” అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంపై విస్తృత పరిశీలన అవసరం అని అభిప్రాయపడింది.

## భారత నౌకాదళం అమ్ముల పొదిలోకి మరో అస్త్రం

### ‘ఐఎన్ ఎస్ తారగిరి’ ని ప్రారంభించనున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ : భారత నౌకాదళం అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరనుంది. అధునాతన టెక్నాలజీ నీలగిరి శ్రేణి స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తారగిరి (ఎఫ్ 41)ని అధికారికంగా నౌకదళంలో చేరేందుకు సిద్ధమవుతోంది. దీనిని ఏప్రిల్ 3న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం నౌకాదళంలో స్వావలంబన దిశగా మన దేశం సాధించిన అద్భుతమైన పురోగతికి నిదర్శనంగా నిలవనుంది.

**ప్రాజెక్ట్ 17ఏలో నాలుగో యుద్ధ నౌక**

ప్రాజెక్ట్ 17ఏ తరగతికి చెందిన నాలుగో ఫ్రిగేట్ యుద్ధనౌక తారగిరి. ముంబయిలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) ఈ యుద్ధనౌకను నిర్మించింది. 75 శాతం స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో సుమారు 6,670 టన్నుల బరువుతో దీనిని తయారు చేశారు. దీనిని మునుపటి నౌకల కంటే మరింత ఆధునిక సాంకేతికతతో రూపొందించారు. ఇందులో ఆధునిక డిజైన్‌తో తక్కువ రాడార్ గుర్తింపు ఉంది. భారత్‌లో నిర్మాణం కోసం ఏర్పాటైన దాదాపు 200 సూక్ష్మ, చిన్న, మధ్యపరిశ్రమల (ఎంఎస్ఎంఈ) సాయంతో ఈ తారగిరి నిర్మాణం జరిగింది. ఇది ఆత్మనిర్భర భారత్ విజయానికి చిహ్నంహా నిలుస్తూ వేదిలా ఉద్యోగాలకు మద్దతు ఇస్తుంది.

**తారగిరి ముఖ్య లక్షణాలు**

కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ (సీఓడీఓజీ) ఇంజిన్ వ్యవస్థతో తారగిరి నడుస్తోంది. హై-స్పీడ్, హై-ఎండ్యూరెన్స్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. బహుళ సముద్ర కార్యకలాపాలను అనుకూలంగా దీనిని రూపొందించారు. ఈ నౌకలో శక్తివంతమైన ఆయుధ వ్యవస్థ ఉంది. అందులో ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే సూపర్ సోనిక్ క్షిపణులు, మధ్యశ్రేణి ఉపరితలం నుంచి గగనతాలనికి ప్రయోగించే క్షిపణులు, యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్(ఏఎస్‌డబ్ల్యూ) వ్యవస్థ ఉంది. ఇవన్నీ అత్యాధునిక కంబాట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా సమన్వయం చేశారు. దీని వల్ల సిబ్బంది అత్యంత కచ్చితత్వంతో ముప్పులకు ప్రతిస్పందించగలరు.

**యుద్ధం మాత్రమే కాదు- సహాయక చర్యలకూ సిద్ధం**

తారగిరి కేవంల యుద్ధ నౌకగా మాత్రమే కాదు. దీనిని మానవతా సాయం, విపత్తు సహాయక చర్యలు, అంతర్జాతీయ సముద్ర దౌత్య కార్యక్రమాల కోసం నిర్మించారు. తారగిరి భారత నౌకాదళాన్ని మరింత శక్తివంతంగా మార్చడమే కాకుండా, దేశ సముద్ర సరిహద్దులను రక్షించే కీలక బలంగా నిలవనుంది. స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ నౌక దేశానికే గర్వకాణంగా నిలుస్తుంది.

**7 యుద్ధ నౌకలకోసం ప్రాజెక్ట్ 17ఏ**

శత్రుదేశ రాడార్లకు చిక్కని సామర్థ్యం కలిగిన ఏడు యుద్ధనౌకలను తయారు చేయాలని భారత నౌకాదళం ‘ప్రాజెక్టు 17ఏ’ ప్రారంభించింది. నీలగిరి శ్రేణిలో అత్యంత అధునాత ఏడు గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్లను నిర్మించే ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ఇది. ఐఏఎన్ఎస్ నీలగిరి, హిమగిరి, ఉదయగిరి, దునాగిరి, తారగిరి, వింధ్యాగిరి, మహేంద్రగిరి ఉన్నాయి. నీలగిరి, ఉదయగిరి, తారగిరి, మహేంద్ర గిరి యుద్ధ నౌకలను ఎండీఎల్ తయారు చేస్తోంది. హిమగిరి, దునాగిరి, వింధ్యాగిరిలను కోల్‌కతాలోని గార్డెన్ రిచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) నిర్మిస్తోంది. వీటి కోసం 75శాతం భారతీయ పరికరాలు, మెటీరియల్‌నే ఉపయోగిస్తున్నారు. గతంలో వాడిని లియాండర్ శ్రేణి యుద్ధనౌకలకు నీలగిరి శ్రేణివి అప్‌డేట్ వెర్షన్‌గా వీటిని తీసుకొస్తున్నారు. ఈ నౌకలను 2019 నుంచి 2023 మధ్య ప్రారంభించారు. 2024-2027 మధ్య పూర్తి స్థాయిలో నౌకదళంలోకి ప్రవేశించనున్నాయి. అందులో భాగంగా ఈ ఏప్రిల్‌లో ఐఎన్ఎస్ తారగిరి చేరనుంది.

ఇక గతేడాది ఆగస్టులోనే ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ హిమగిరిని రెండు యుద్ధ నౌకలకు కమిషన్ చేశారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. భారత నౌకదళానికి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరో డిజైన్ చేసిన 100వ నౌకగా ఐఎన్ఎస్ ఉదయగిరి నిలిచింది.నౌకాదళంలో సన్‌రైజ్ ఫ్లీట్‌గా పిలిచే ఈస్ట్రన్ నేవల్ కమాండ్‌లో ఉదయగిరి భాగమైంది.

## హర్మూజ్‌ను తెరవండి..!

### ఇరాన్‌కు 22 దేశాల విజ్ఞప్తి

న్యూఢిల్లీ : హర్మూజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి చేశాయి. చమురు క్షేత్రాలు, వాణిజ్య నౌకలపై ఇరాన్ చేస్తోన్న దాడులను ఖండించాయి. ఈ చర్యల వల్ల అన్ని దేశాలపైనా దుష్ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు యూఏఈ, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, డెన్మార్క్, బహ్రెయిన్ తదితర దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. “గల్ఫ్‌లోని నిరాయుధ వాణిజ్య నౌకలు, చమురు, గ్యాస్ కేంద్రాలు సహా మౌలిక సదుపాయాలపై ఇటీవల ఇరాన్ జరిపిన దాడులు, హర్మూజ్ జలసంధి మూసివేత చర్యలను ఖండిస్తున్నాం. సముద్ర చట్టాలకు సంబంధించి ఐరాస ఒప్పందంతో పాటు స్వేచ్ఛాయుత నౌకాయానం అనేది అంతర్జాతీయ చట్టంలో ఓ ప్రాథమిక సూత్రం. ఇరాన్ చర్యలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల ప్రజలపై, ముఖ్యంగా అత్యంత బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి” అని యూఏఈ విదేశాంగ శాఖ ఓ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఇందులో 22 దేశాలు సంతకాలు చేశాయి

# ‘స్వేచ్ఛా నౌకాయానం కాపాడుదాం

- సముద్ర మార్గాల భద్రత ముఖ్యం’
- ఇరాన్ అధ్యక్షుడు పెజిష్కియాన్‌తో ప్రధాని మోదీ మాటా మంతి
- ఈద్, నౌరోజ్ శుభాకాంక్షలు తెలిపిన పీఎం
- పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్ష
- దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని ఆందోళన
- ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తాయని స్పష్టీకరణ



న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్‌తో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఇరాన్ అధ్యక్షుడికి ఈద్, నౌరోజ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ సీజన్ పశ్చిమాసియాలో శాంతి, స్థిర త్వం, శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ పశ్చిమాసియాలోని కీలక మౌలిక సదు-పాయాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని, ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛను కాపాడడం, సముద్ర రవాణా మార్గాలను సురక్షితంగా ఉంచడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. అంతేకాదు ఇరాన్‌లో ఉన్న భారత పౌరుల భద్రతకు సంబంధించి అక్కడి ప్రభుత్వం అందిస్తున్న నిరంతర సహకారానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. “ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెస్కి యాన్‌తో మాట్లాడి ఈద్, నౌరోజ్ శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ పండుగలు పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పుతాయని ఆశిస్తున్నాను. ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీసే మౌలిక సదుపాయాలపై దాడులను ఖండించాను.” అని ప్రధాని మోదీ, ఎక్స్ పోస్టు లో పేర్కొన్నారు.

**దౌత్య సంబంధాలు**

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు దాడులు చేయడంతో పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇరాన్ అధ్యక్షుడితో మోదీ మాట్లాడడం ఇదే రెండోసారి. అంతకు ముందు మార్చి 12న ఇరువురు నేతలు మాట్లాడుకున్నారు. అప్పుడు ఇరాన్ అధ్యక్షుడు యుద్ధ పరిస్థితుల గురించి వివరించారు. అయితే భారత్ మొదటి నుంచి అన్ని సమస్యలను చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలని, ఇదే తమ స్థిరమైన విధానమని స్పష్టం చేస్తూ వస్తోంది. వాస్తవానికి పశ్చిమాసియా సంక్షోభం మొదలైనప్పటి నుంచి ప్రధాని మోదీ - సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా తదితర దేశాల నాయకులతో సంప్రదింపులు జరిపారు.

**వార్ ఎఫెక్ట్**

గత మూడు వారాలుగా ఇరాన్ వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్‌ల మధ్య దాడులు, ప్రతిదాడులు నిరంతరాయంగా కొనసాగుతూ ఉన్నాయి. ముఖ్యంగా ఇరాన్ ప్రతీ కార దాడులకు దిగి ఇజ్రాయెల్‌తో సహా, తన పొరుగు దేశాల్లో ఉన్న అమెరికన్ మిలటరీ బేస్‌లను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తోంది. అంతేకాదు ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20 శాతం మేర జరిగే హర్మూజ్ జలసంధిని తన నియంత్రణలోకి తీసుకుంది. దీనితో ప్రపంచ వ్యాప్తంగా చమురు సహా మిగతా ఇంధన సమస్యలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ కొన్ని ఎంచుకున్న చమురు నౌకలను మాత్రమే హర్మూజ్ గుండా వెళ్లేందుకు అనుమతి ఇస్తోంది.

**ఇరాన్ ప్రస్తుత పరిస్థితి ఏమిటి?**

అలీ ఖమేనీ మృతి తర్వాత, ఆయన కుమారుడు మోజ్తబా ఖమేనీ ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నికయ్యారు. ఆయన కూడా యుద్ధ రంగంలో తగ్గేది లేదంటున్నారు. అందుకే అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులు కొనసాగిస్తున్నారు. దీనితో యుద్ధం మరింత తీవ్రమవుతోంది. మరోవైపు ఇరాన్‌లోని అత్యంత కీలకమైన నతాంజ్ యురేనియం శుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్‌లో సంయుక్తంగా వైమానిక దాడులు జరిపాయి. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ తస్నిమ్ ధ్రువీకరించింది. అయితే ఈ దాడి తర్వాత ఎలాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువడలేదని పేర్కొంది. కనుక అణుకేంద్రం సమీపంలో నివసించే ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని అధికారులు తెలిపారు. ఇంతకు ముందు అంటే గురువారం ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ ద్రవీకరణ కేంద్రమైన ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ పారిశ్రామిక నగరంపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. దీనితో తమ దేశ ఎల్ఎన్‌జీ ఎగుమతి సామర్థ్యం 17 శాతం మేర పడిపోయిందని, తమకు భారీ నష్టం

# ఇరాన్‌పై దాడులను ఖండించరా?

- ఇజ్రాయెల్, అమెరికా దాడుల ఖండించని మోదీ సర్కార్
- ఇది సర్కార్ పిరికితనానికి, ద్రోహానికి నిదర్శనం
- భారత నాగరికత విలువలకు ద్రోహం చేసినట్లే
- - కాంగ్రెస్ విమర్శలు



ఇన్యూఢిల్లీ : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు చేస్తున్న దాడుల విషయంలో మోదీ సర్కార్ అనుసరిస్తున్న వైఖరిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇరాన్‌పై జరుగుతున్న వైమానిక దాడులను, ఆ దేశ అగ్రనేతల హత్యలను, అక్కడ బలవంతపు పాలనా మార్పు కోసం జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవడంలో మోదీ సర్కార్ పూర్తిగా విఫలమైందని విమర్శించింది. దాడులను ఖండించకపోవడం నైతిక పిరికితనానికి చిహ్నమని, భారత నాగరికత విలువలకు ద్రోహం చేయడమేనని పేర్కొంది.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం ఎక్స్ వేదికగా మోదీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. “ప్రధాని మోదీ తనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులతో గొప్ప స్నేహం ఉందని చెప్పుకుంటారు. మరి ఆ గొప్ప స్నేహాన్ని ఉపయోగించి, యుద్ధాన్ని ఆపడానికి మోదీ ఎందుకు చొరవ తీసుకోవడం లేదు” అని ప్రశ్నించారు.“ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు ప్రారంభమై సరిగ్గా 21 రోజులు లేదా మూడు వారాలు అవుతోంది. ప్రధాని మోదీ తన ఆర్భాటపు ఇజ్రాయెల్ పర్యటన ముగించుకుని, తిరిగి భారత్‌కు వచ్చి కూడ 23 రోజులైంది. కానీ, ప్రస్తుతం భారత్‌లో సహా ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అస్థిరతకు దారితీసిన అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులను మోదీ సర్కార్ ఖండించిందా? కనీసం విమర్శించిందా? అంటే, దానికి సమాధానం లేదు పోనీ అమెరికా-ఇజ్రాయెల్‌లో ఇరాన్ అగ్రనేతలను లక్ష్యంగా చేసుకొని హత్యలు చేస్తోంది. కనీసం మోదీ ప్రభుత్వం ఆ హత్యలను ఖండించిందా? అంటే, దానికి కూడా సమాధానం లేదు ఇరాన్‌లో అంతర్యుద్ధం వచ్చేలా, అక్కడి ప్రభుత్వాన్ని కూల్చేసి దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న క్రూరమైన ప్రయత్నాలను మోదీ సర్కార్ విమర్శించిందా? అంటే, దానికి సమాధానం లేదు పోనీ ఇరాన్‌పై చేస్తున్న బాంబు దాడులను, అలాగే గల్ఫ్ దేశాల్లోని ఇంధన, ఇతర మౌలిక సదుపాయాలపై ఇరాన్ చేస్తున్న దాడులను వెంటనే నిలిపివేయాలని చెబుతూ, మోదీ ప్రభుత్వం ఏమైనా దౌత్యప్రయత్నాలు చేసిందా? ఏమైనా చొరవ తీసుకుందా? కాల్పుల విరమణ కోసం ప్రధాని మోదీ తన స్నేహాన్ని ఉపయోగించారా? అంటే, దానికి సమాధానం లేదు (నో). ఈ నాలుగు ‘నో’లు మోదీ ప్రభుత్వ నైతిక పిరికితనాన్ని, భారత నాగరికత విలువల పట్ల చేస్తున్న రాజకీయ ద్రోహాన్ని ప్రతిబింబిస్తున్నాయి.” అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యునికేషన్స్) - జైరాం రమేశ్ ఎక్సోపోస్ట్ పెట్టారు

**మరింత తీవ్రమవుతున్న యుద్ధం**

గత మూడు వారాలుగా కొనసాగుతున్న పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గే సూచనలు కనిపించడం లేదు. శనివారం తెల్లవారు జామున కూడా ఇరాన్ తమపై క్షిపణులు ప్రయోగించిందని ఇజ్రాయెల్ పేర్కొంది. మరోవైపు, తమ ప్రధాన చమురు కేంద్రాలు ఉన్న తూర్పు ప్రాంతంలో కేవలం 2 గంటల వ్యవధిలో 20 డ్రోన్‌లను కూల్చివేసినట్లు సౌదీ అరేబియా వెల్లడించింది. మ-రోవైపు ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గడం లేదు. ఇప్పటికే గల్ఫ్ దేశాల్లోని ఇంధన కేంద్రాలపై దాడులు చేస్తున్న ఇరాన్, ఇకపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలపై కూడా దాడులు చేస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో, అమెరికా మరిన్ని యుద్ధ నౌకలను, మరో 2500 మెరైన్స్‌ను పశ్చిమాసియాలో మోహరిస్తోంది. కాగా, ఇప్పటి వరకు జరిగిన యుద్ధం వల్ల ఇరాన్‌లో 1300 మందికి పైగా, లెబనాన్‌లో 1000 మందికి పైగా, ఇజ్రాయెల్‌లో 15 మంది, అమెరికాకు చెందిన 13 మంది సైనికులు మ-రణించారు. లెబనాన్, ఇరాన్‌ల్లో లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు.

# దేశ రక్షణ మరింత పటిష్ఠం

- భారీ సైన్యం అవసర మన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్
- యుద్ధ స్వరూపం పరిణామం మారుతోంది
- సాంకేతిక త రంగరించుకుని కొత్త పుంతలు తొక్కి సరిహద్దులు దాటుతోంది
- దేశ రక్షణ కోసం అంతా ఐకమత్యంగా ఉండాల్సిన తరుణమిది
- పౌరుల మద్దతు కలిగిన బలమైన సైన్యం అవసరం
- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ : యుద్ధ స్వరూపం పరిణామం చెందుతోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. జాతీయ భద్రత అనేది ఇప్పుడు ఆర్థిక, డిజిటల్, ఇంధనం, ఆహార భద్రతలను సైతం తన పరిధిలోకి తీసుకుందని మంత్రి వివరించారు. దేశ రక్షణ కోసం ఐకమత్యంగా ఉండే పౌరుల మద్దతు కలిగిన బలమైన సైన్యం అవసరమని నొక్కిచెప్పారు. ఉత్తరాఖండ్‌లోని ఘోరఖల్ సైనిక్ పాఠశాల డైమండ్ జూబ్లీ కార్యక్రమానికి వర్చువల్‌గా రక్షణ మంత్రి హాజరై, ఆయన మాట్లాడారు.

**దేశ రక్షణకై భుజం, భుజం కలిపి నిలబడగల సైన్యం అవసరం!**

ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా దేశాన్ని రక్షించేందుకు పటిష్ఠమైన సైన్యం అవసరమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నొక్కి చెప్పారు. దేశ రక్షణ కోసం భుజం, భుజం కలిపి నిలబడగల సన్నద్ధమైన సైన్యం అవసరమన్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి యువత క్రమశిక్షణ, పట్టుదల ద్వారా మానసిక దృఢత్వాన్ని, మేధో స్పష్టతను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. దేశాన్ని ఆర్థిక,సైబర్, అంతరిక్ష, సమాచార యుద్ధతంత్రాలతో కూడా బలహీనపర్చొచ్చని ప్రస్తుత పరిస్థితులు నిరూపిస్తున్నాయని మంత్రి వ్యాఖ్యానించారు. అందువల్ల ప్రతి పౌరుడు అన్ని వేళలా అప్రమత్తంగా, సంసిద్ధంగా ఉండడం అత్యంత అవసరమని నొక్కి చెప్పారు. అందుకే దేశ నిర్మాణానికి అవసరమైన విలువల్ని యువత అలవర్చుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు.

**100 కొత్త సైనిక్ పాఠశాలలను ఏర్పాటు**

సాయుధ దళాలకు అధునాతన ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రాజ్‌నాథ్ ప్రస్తావించారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ లో ఖాళీల సంఖ్యను పెంచడం గురించి ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా పబ్లిక్- ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో 100 కొత్త సైనిక్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో గతంలో 17 లక్షల మంది క్యాడెట్లు ఉండగా దాన్ని 20 లక్షలకు విస్తరించినట్లు చెప్పారు. అదేవిధంగా, సైనిక్ పాఠశాలల్లో బాలికలకు ప్రవేశం కల్పించినట్లు ఆయన గుర్తుచేశారు. ఆ నిర్ణయం చారిత్రాత్మకమైనదని, అది దేశ ‘నారీ శక్తి’ని బలోపేతం చేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. రాబోయే కాలంలో వారు ‘నారీ శక్తి’కి మార్గదర్శకులుగా నిలిచి, వివిధ రంగాలలో కొత్త శిఖరాలను అధిరోహిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


**వారిద్దరూ సిద్ధంగా ఉన్నప్పుడే బలమైన దేశం ఏర్పడుతుంది!**

ఈ సందర్భంగా దేశ సేవకై 60 ఏళ్లు కృషి చేసిన ఘోరాఖల్‌లోని సైనిక్ పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, వారి కుటుంబాలకు రాజ్‌నాథ్ శుభాకాంక్షలు తెలిపారు. గడిచిన కాలంలో, ఆ పాఠశాల 800 మందికి పైగా విద్యార్థులను నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)కి, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్) పరీక్ష, ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఏఎఫ్ సీఏటీ) వంటి ప్రవేశాల ద్వారా దాదాపు 2,000 మందికి పైగా అభ్యర్థులను సాయుధ దళాలకు పంపిందని రాజ్‌నాథ్ సింగ్ గుర్తు చేశారు. అదేవిధంగా, విద్యా, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో విద్యార్థులు సాధించిన అసాధారణ విజయాలను కూడా ఆయన ప్రశంసించారు.

రాబోయే కాలంలో విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో ఉన్నత ప్రమాణాలను కొనసాగిస్తారని, వారి కుటుంబాలకు, సంస్థకు దేశానికి గర్వకారణంగా నిలుస్తారని రాజ్‌నాథ్ సింగ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఆధునిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి విద్యార్థులు తమదైన శైలిలో ఎఖ-జూను, అంటే (దూరదృష్టి, అవగాహన, ధైర్యం, అనుకూలత)ను పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే, ప్రస్తుతం తలెత్తుతున్న సవాళ్లను ఎదుర్కొవడానికి సైన్యం, పౌరులు ఇద్దరూ సిద్ధంగా ఉన్నప్పుడే బలమైన దేశం ఏర్పడుతుందని రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు.

# ఇరాన్ మిస్సైల్ పరిధి 4వేల కిలో మీటర్లు?

- డిగో గార్సియాపై దాడితో ఉలిక్కిపడ్డ ప్రపంచం
- ప్రకటించిన పరిధిని మించి ఇరాన్ క్షిపణి ప్రయోగం
- డిగో గార్సియాపై రెండు బాలిస్టిక్ మిస్సైళ్లతో దాడి ప్రయత్నం
- ఒకటి విఫలం, మరొకదాన్ని అడ్డుకున్న అమెరికా



న్యూఢిల్లీ : 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేధించే ప్రయత్నం. ఇదే ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు తన క్షిపణుల గరిష్ఠ పరిధి 2,000 కిలోమీటర్లేనని ప్రకటిస్తూ వచ్చిన ఇరాన్, హిందూ మహాసముద్రంలోని కీలక సైనిక స్థావరమైన డిగో గార్సియాను లక్ష్యంగా చేసుకోవడం ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

**ఒకటి గాల్లోనే- మరొకటేమో! :** అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, చాగోస్ దీవుల్లో ఉన్న అమెరికా- బ్రిటన్ సంయుక్త సైనిక స్థావరం డిగో గార్సియాపై ఇరాన్ రెండు మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే ఈ దాడి పూర్తిగా విజయవంతం కాలేదు. ప్రయోగించిన క్షిపణుల్లో ఒకటి గాల్లోనే విఫలమవగా, మరొకదాన్ని అమెరికా యుద్ధనౌక సమర్థవంతంగా అడ్డుకున్నట్లు సమాచారం. దాడి లక్ష్యాన్ని చేరుకోకపోయినా, ఈ ఘటన ప్రాధాన్యం మాత్రం గణనీయంగా పెరిగింది.

**2,000 కిలోమీటర్లకే పరిమితమని చెబుతున్నా!:** కారణం- డిగో గార్సియా స్థావరం ఇరాన్ భూభాగం నుంచి సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలో ఉండటం. ఇంతదూరంలో ఉన్న లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం చేయడం ద్వారా ఇరాన్ ప్రకటించని క్షిపణి సామర్థ్యాలు ఉన్నాయనే అనుమానాలు బలపడుతున్నాయి. ఇరాన్ ఇప్పటి వరకు తన బాలిస్టిక్ క్షిపణుల గరిష్ఠ పరిధి 2,000 కిలోమీటర్లకే పరిమితమని అధికారికంగా చెబుతూ వచ్చింది. కానీ తాజా పరిణామాలు చూస్తుంటే, ఆ దేశం వాస్తవానికి మరింత దీర్ఘ శ్రేణి క్షిపణులను అభివృద్ధి చేసి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ మిసైళ్ల స్థాయికి చేరువలో ఉన్న సాంకేతికతను పరీక్షించి ఉండవచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రపంచంలోనే అత్యంత కీలక సైనిక స్థావరాల్లో ఒకటి :** ఈ చర్య ద్వారా ఇరాన్ కేవలం సైనిక శక్తిని ప్రదర్శించడం మాత్రమే కాకుండా వ్యూహాత్మక సందేశాన్ని కూడా పంపింది. తమ అసలు సామర్థ్యాలపై స్పష్టత ఇవ్వకుండా ప్రత్యర్థి దేశాలను అనిశ్చితిలో ఉంచడం ద్వారా మానసిక ఒత్తిడి సృష్టించడమే టెహ్రాన్ లక్ష్యంగా కనిపిస్తోంది. హిందూ మహాసముద్రంలోని చాగోస్ దీవుల్లో ఉన్న డిగో గార్సియా ప్రపంచంలోనే అత్యంత కీలక సైనిక స్థావరాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. అమెరికా గ్లోబల్ సైనిక కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా పనిచేస్తోంది. ముఖ్యంగా అఫ్గానిస్తాన్, ఇరాక్ యుద్ధాల సమయంలో ఆ స్థావరం నుంచి బాంబింగ్ దాడులు నిర్వహించబడ్డాయి. భారీ బాంబర్లు, గూఢచారి విమానాలు ఇక్కడ స్థావరంగా ఉండడం వల్ల దీని ప్రాధాన్యం మరింత పెరిగింది.

**శత్రువులు ఊహించిన దానికంటే ఎక్కువగా :** అంతేకాకుండా, 9/11 దాడుల తర్వాత అమెరికా గూఢచారి సంస్థలు అత్యంత రహస్య కార్యకలాపాలకు కూడా ఈ కేంద్రాన్ని వినియోగించాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డిగో గార్సియాపై దాడి ప్రయత్నం జరగడం అంతర్జాతీయంగా పెద్ద పరిణామంగా భావిస్తున్నారు. ఇరాన్‌కు అనుబంధంగా భావించే వర్గాలు ఆ దాడిని కీలక ముందడుగుగా అభివర్ణిస్తున్నాయి. తమ క్షిపణి పరిధి శత్రువులు ఊహించిన దానికంటే ఎక్కువగా ఉందని సంకేతాలు ఇస్తున్నాయి. ఇది ప్రత్యర్థి దేశాలకు ఒక హెచ్చరికగా కూడా భావిస్తున్నారు.

ఈ పరిణామం అమెరికా, బ్రిటన్ దేశాల రక్షణ వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశముంది. ఇప్పటి వరకు ప్రధానంగా గల్ఫ్ ప్రాంతంపై దృష్టి పెట్టిన ఈ దేశాలు, ఇకపై హిందూ మహాసముద్ర ప్రాంతంలో కూడా తమ రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా క్షిపణి నిరోధక వ్యవస్థలను మరింత విస్తరించే దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇక గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్ వంటి దేశాలు కూడా ఈ పరిణామాన్ని ఆందోళనతో గమనిస్తున్నాయి. ఇరాన్ క్షిపణుల పరిధి నిజంగా పెరిగితే, యూరప్ దక్షిణ ప్రాంతాల వరకు కూడా అవి చేరే అవకాశం ఉందని భద్రతా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**యుద్ధరంగం విస్తరిస్తోందనే సంకేతాలు:** ఇటీవల జరిగిన మరో ఘటన కూడా ఈ ఉద్రిక్తతలను మరింత పెంచింది. హిందూ మహాసముద్రంలో జరిగిన దాడిలో ఇరాన్‌కు చెందిన యుద్ధనౌక మునిగిపోయినట్లు వచ్చిన వార్తలు ఉద్రిక్తతలకు దారితీశాయి. ఆ ఘటనకు ప్రతిస్పందనగానే డిగో గార్సియాను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ఈ క్షిపణి ప్రయోగం చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే, ఈ 4,000 కిలోమీటర్ల దాడి ప్రయత్నం యుద్ధరంగం విస్తరిస్తోందనే సంకేతాలను ఇస్తోంది. గల్ఫ్ ప్రాంతాన్ని దాటి హిందూ మహాసముద్రం వరకు ఉద్రిక్తతలు వ్యాపిస్తున్నాయి. ఇది ప్రపంచ వ్యూహాత్మక సమీకరణాల్లో కీలక మార్పులకు నాంది పలకవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## రాష్ట్రాలకు ఎల్పీజీ కేటాయింపు పెంపు

### అదనంగా 20 శాతం ఇచ్చేందుకు కేంద్రం ఓకే




న్యూఢిల్లీ : వాణిజ్య గ్యాస్ కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టిన కేంద్రం.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్పీజీలో అదనంగా 20శాతం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. తాజా చర్యతో సంక్షోభ కాలానికి ముందున్న కేటాయింపుల్లో 50శాతానికి చేరినట్లయ్యిందని పేర్కొంది. అయితే, వీటిలో హోటళ్లు, రెస్టరంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, సబ్సిడీల్లో ఆహారం అందించే కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది.

చమురు కంపెనీల వద్ద రిజిస్టరైన వాణిజ్య సంస్థలతోపాటు పీఎన్‌జీ (పైపు ద్వారా గ్యాస్ పంపిణీ) కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటికే ఈ అదనపు కేటాయింపు వర్తిస్తుందని కేంద్రం పేర్కొంది. మార్చి 23 నుంచి నుంచి ఈ అదనపు కేటాయింపులు సరఫరా చేస్తామని తెలిపింది. దీంతోపాటు వలస కూలీలకు ఐదు కిలోల గ్యాస్ సిలిండర్లు అందజేయాలని సూచించింది. సిలిండర్లు పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పెట్రోలియంశాఖ కార్యదర్శి లేఖ రాశారు.




### రాజకీయాలకు దూరంగా...

## వ్యవసాయంలో విజయసాయిరెడ్డి

**జీవామృతం తయారీలోని మాజీ ఎంపీ నిమగ్నం**



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : వైసీపీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తర్వాత రాజకీయాలకు దూరంగా ఉన్న సీనియర్ నేత విజయసాయి రెడ్డి ఇప్పుడు పూర్తిగా వ్యవసాయంపై దృష్టి సారించారు. హైదరాబాద్ శివార్లలోని తొండుపల్లి వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ వ్యవసాయం చేస్తూ, 'జీవామృతం' తయారీకి సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పంచుకున్నారు.

ఆ వీడియోలో జీవామృతం తయారీ విధానాన్ని స్వయంగా వివరించిన ఆయన, "సేంద్రియ వ్యవసాయంలో మిత్ర పురుగులు, వానపాములు, సూక్ష్మజీవులు భూసారం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఆవు పేడ, ఆవు మూత్రం, తాటిబెల్లం, సెనగ పిండి, పుట్టమట్టిని సమపాళ్లలో కలిపి, రోజుకు రెండు సార్లు మూడు రోజుల పాటు కలిపితే జీవామృతం సిద్ధమవుతుంది" అని తెలిపారు.

2024 ఎన్నికల అనంతరం పార్టీకి, పదవికి రాజీనామా చేసిన విజయసాయి రెడ్డి అప్పటి నుంచి రాజకీయాలకు పూర్తిగా దూరమయ్యారు. ఒకప్పుడు పార్టీ అధినేతకు అత్యంత సన్నిహితుడిగా, పార్టీలో కీలక పాత్ర పోషించిన ఆయన, ప్రస్తుతం తన వ్యవసాయ క్షేత్రంలోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. సోషల్ మీడియాలో మాత్రం చురుగ్గా ఉంటూ, వ్యవసాయ అనుభవాలు, అభిప్రాయాలను పంచుకుంటూ వార్తల్లో నిలుస్తున్నారు.

### కావూరు సాంబశివరావుకు మంత్రి పొన్నం నివాళి



తెలంగాణ బ్యూరో ప్రతినిధిః మాజీ కేంద్రమంత్రి కావూరు సాంబశివరావు మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు చేనేత సమస్యలు పరిష్కరించారని తెలిపారు. శనివారం హైటెక్స్ నోవోటెల్ లో మాజీ కేంద్రమంత్రి కావూరి సాంబశివరావు దశ దిన కర్మ సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్,తుమ్మల నాగేశ్వరరావు, ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ మాకు అప్పుడు 15 వ లోక్ సభ లో తోటి పార్లమెంట్ సభ్యులు కావూరి సాంబశివరావు కి మా నివాళులు అని తెలిపారు. ఆయన తో నాకు సన్నిహిత సంబంధం ఉండేది.. సోదరుడిగా నాకు మార్గదర్శకత్వం చేసేవారు. కావూరి సాంబశివరావు కేంద్ర జౌళి శాఖ మంత్రి గా ఉన్నప్పుడు సిరిసిల్ల పర్యటించి చేనేత కార్మికుల సమస్యలు పరిష్కారం చేశారు. వారికి నివాళులు అర్పిస్తున్న వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా..అని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

### ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు : మంత్రి పొన్నం

తెలంగాణ బ్యూరో ప్రతినిధిః రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్‌లి. హుస్నాబాద్‌లో ఈద్గా లో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులతో ఫోన్ లో మాట్లాడి వారికి ఈద్ ముబారక్ తెలిపారు..పవిత్రమైన రంజాన్ మాసం ముగింపు సందర్భంగా జరుపుకునే ఈద్ పండుగ మీ అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.రంజాన్ నెల అనేది ఆత్మశుద్ధి, సహనం, దయ, కరుణ, త్యాగం వంటి మహత్తర విలువలను మన జీవితాల్లో అలవర్చుకునే పవిత్రమైన కాలం. ఈ నెలలో మీరు ఆచరించిన ఉపవాసాలు మనసును పవిత్రం చేయడమే కాకుండా సమాజంలో పరస్పర సహకారం, సోదరభావం పెంపొందించాయి.ఈద్ పండుగ మనకు సంతోషం, ఐక్యత, శాంతి సందేశాన్ని అందిస్తుంది. మన సమాజంలో ప్రేమ, సహనం, పరస్పర గౌరవం మరింత పెరగాలని కోరుకుంటున్నాను. ప్రజా పాలన ప్రభుత్వం ఎల్లప్పుడూ సాంస్కృతిక వైవిధ్యానికి నిలయంగా నిలుస్తోంది. ఈద్ వంటి పండుగలు మనందరినీ ఒకే కుటుంబంగా కట్టిపడేస్తాయి.ఈ పవిత్ర సందర్భంగా, అల్లాహ్ మీ అందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం ప్రసాదించాలని కోరుకుంటు అందరికీ ఈద్ ముబారక్ అని మంత్రి పొన్నం తెలిపారు.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసు

**సిట్ బృందానికి చిక్కిన డ్రగ్ పెడ్లర్ అభిషేక్ సింగ్**

తెలంగాణ బ్యూరో ప్రతినిధిః తెలుగు రాష్ట్రాల్లో మొయినాబాద్ డ్రగ్స్ కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సిట్ దర్యాప్తు చేపట్టిన ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒకరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది. హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పార్టీకి అభిషేక్ సింగ్ డ్రగ్స్ సప్లై చేశాడు. హైదరాబాద్ ఓఆర్ఆర్ వద్ద అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం పార్టీలో నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి డ్రగ్స్ వినియోగించారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడగా.. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. తాజాగా, అభిషేక్ సింగ్ పోలీసులకు చిక్కడంతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభిషేక్ సింగ్ నుంచి ఇంకా ఎవరెవరూ డ్రగ్స్ కొనుగోలు చేశారు? అనే విషయంపైనా కూపీ లాగుతున్నారు సిట్ అధికారులు. మరోవైపు అతని ఫోన్‌లో కీలక డేటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అభిషేక్ సింగ్ సెల్ ఫోన్ డేటాను విశ్లిస్తున్నారు సిట్ అధికారులు.

### సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై యుద్ధ ప్రభావం

**ఉత్పత్తిలో టార్గెట్ రీచ్ కాలేకపోతున్న యాజమాన్యం**

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: యుద్ధ ప్రభావం సింగరేణి మీద పడింది. ఉత్పత్తిలో టార్గెట్ ను రీచ్ కాలేకపోతుంది. అసలు ఈ పరిస్థితికి కారణం ఏంటి దానికి యుద్ధానికి లింక్ ఏంటి యాజమాన్యం ఏమంటుంది? ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు ఉమ్మడి జిల్లాలో విస్తరించి ఉన్న సింగరేణి సంస్థ దేశానికే తలమానికం. ఇది పారిశ్రామికీకరణతో పాటు అనేక ధర్మల విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఉన్న 12 ఏరియాల్లో 18 ఓపెన్ కాస్ట్ గనులు 19 భూగర్భ గనులు ఉన్నాయి. ఇందులో ఓపెన్ కాస్ట్ గనుల్లోనే 80% నికి పైగా బొగ్గు ఉత్పత్తి సాగుతుంది. అనుకున్న టార్గెట్ ను ఓపెన్ కాస్ట్ గనులే తీర్చుతూ ఉంటాయి. అయితే ఇప్పుడు సింగరేణికి ఇప్పుడు యుద్ధం సమస్య వచ్చిపడింది. యుద్ధంతో పేలుడు పదార్థాల కొరత ఏర్పడింది. ఇప్పటికైతే అధికారికంగా స్పష్టం చేయడం లేదు. కానీ.. పేలుడు పదార్థాల కొరత ఉంది. ప్రధానంగా బొగ్గు ఉత్పత్తిలో ఓపెన్ కాస్ట్ గనులు కీలకంగా ఉంటున్నాయి.

# సర్పంచ్‌ల ఫీడ్‌బ్యాక్‌కు అధిక ప్రాధాన్యత

- మంత్రి సీతక్క ఆదేశాలతో రంగంలోకి మిషన్ భగీరథ ఇంజనీర్-ఇన్-చీఫ్
- సర్పంచులు గుర్తించిన తాగు నీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ఇంజనీర్–ఇన్–చీఫ్ కార్యాలయం నుండి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల సర్పంచులతో నేరుగా అనుసంధానం చేపట్టి తాగునీటి సరఫరా వ్యవస్థపై సమగ్ర ఫీడ్‌బ్యాక్ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. గత పది రోజులుగా ఫోన్ ద్వారా సర్పంచులతో సంప్రదింపులు జరిపి, మొత్తం 12,728 గ్రామ పంచాయతీలలో 12,457 మంది సర్పంచుల అభిప్రాయాలను సేకరించారు. తాగునీటి సరఫరా, నీటి నాణ్యత, ఓవర్ హెడ్ ట్యాంకుల క్లోరినేషన్, ట్యాంకుల శుభ్రత, పైపులైన్ లీకేజీలు, పంపుల పనితీరు, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్లు, టోల్ ఫ్రీ నెంబర్ 1916పై అవగాహన తదితర 16 కీలక అంశాలపై వివరాలు సేకరించారు. దీనిపై మంత్రి సీతక్క శనివారం నాడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్పంచ్‌ల అభిప్రాయ సేకరణ వివరాలను తెలుసుకున్నారు. ఈ అభిప్రాయ సేకరణలో అధిక శాతం సర్పంచులు తాగునీటి సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేయడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, "గ్రామస్థాయిలో సర్పంచ్‌ల అభిప్రాయమే ప్రభుత్వానికి అసలైన మార్గదర్శకం. వారి సూచనల ఆధారంగా మిషన్ భగీరథ సేవలను మరింత మెరుగుపరుస్తాం. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడం మా ప్రధాన లక్ష్యం" అని తెలిపారు. సర్పంచులు గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిషన్ భగీరథ అధికారులు గ్రామాలకు వెళ్లి పరిశీలించి, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 2026 ఏప్రిల్ 1 నుండి 15 లోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మిషన్ భగీరథ వ్యవస్థ లేని మారుమూల గ్రామాల్లో ప్రజల అవసరాల మేరకు ఓపెన్ వెల్స్ తవ్వించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల్లో భాగంగా వర్షాకాలానికి ముందే చెక్‌డ్యాంలు నిర్మించాలని మంత్రి సూచించారు. "స్థానిక నీటి వనరులను బలోపేతం చేయడం ద్వారా దీర్ఘకాలికంగా నీటి లభ్యత పెరుగుతుంది" అని పేర్కొన్నారు. తాగునీటి సమస్యలపై ఎవరైనా టోల్ ఫ్రీ నెంబర్ 1916కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గత వేసవిలో ఎలాంటి తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నట్లే, ఈ వేసవిలో కూడా మిషన్ భగీరథ ఇంజనీర్లు నిరంతర పర్యవేక్షణతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. సమస్యాత్మక గ్రామాలు, అటవీ ప్రాంతాలు, ఆదివాసీ గూడాలు, లంబాడీ తాండాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వార్తా పత్రికలు, సోషల్ మీడియాలో తాగునీటి సరఫరాపై వచ్చే ప్రతి సమాచారం పట్ల వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని మంత్రి సీతక్క మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు.

## రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

- ముస్లిం సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి
- సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తుందని వెల్లడి



తెలంగాణ బ్యూరో ప్రతినిధిః ఇస్లాం మతస్తులు అత్యంత పవిత్రంగా ఆచరించే రంజాన్ వేడుకలను ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు అంత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన పలు ప్రార్థనల్లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. మట్టేవాడ, ఎల్బీ నగర్, ఖిలా వరంగల్ ప్రాంతాల ఈద్గాల్లో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పవిత్ర రంజాన్ మాసంలో నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించి ఆధ్యాత్మికతతో పండుగను జరుపుకుంటున్న ముస్లిం సోదర, సోదరీమణులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి ఈద్గా ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తుందని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. నిన్న ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లింల అభివృద్ధికి రూ.3,500 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లింలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగిందని,ఇది కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమని గుర్తు చేశారు..దీంతో ముస్లింలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఏర్పడిందని వివరించారు. ఈ సందర్భంగా తమ నియోజకవర్గం వ్యాప్తంగా ఈద్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులను కేటాయించినట్లు వివరించారు.. మట్టేవాడ ఈద్గా, ఖిలా వరంగల్ ఈద్గా లకు అభివృద్ధికి చెరొక రూ.1 కోటి రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, అలాగే ఎల్బీ నగర్ ఈద్గా అభివృద్ధికి రూ.60 లక్షల రూపాయిలు,చింతల్ ఈద్గా అభివృద్ధికి రూ.40 లక్షలు రూపాయలను మంజూరు చేసినట్లు తెలిపారు..ముస్లిం సోదరుల సంక్షేమార్థం 400 కుట్టు మిషన్ యంత్రాలను పంపిణీ చేయడంతో పాటు, రంజాన్ తోఫా కింద 3,500 కిట్లను చేశామన్నారు.. రంజాన్ వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని, సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తాయని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అల్లాను ప్రార్థించినట్లు తెలిపారు.

# జీవన్ రెడ్డితో ముగిసిన మంత్రుల భేటీ

- పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి
- తన నిర్ణయం మారదంటున్న జీవన్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధిః కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌ల భేటీ ముగిసింది. పార్టీ పెద్దల తీరుపై గత కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్న జీవన్ రెడ్డి.. కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి.. బీఆర్ఎస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో జీవన్ రెడ్డిని కలిసిన మంత్రులు.. ఆయనను బుజ్జగించే ప్రయత్నం చేశారు. చాలా సమయం జీవన్ రెడ్డితో చర్చలు జరిపిన మంత్రులు.. పార్టీలో ఆయనకు సముచిత ప్రాధాన్యం దక్కేలా అధిష్ఠానం చూసుకుంటుందని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే, వీరి బుజ్జగింపులు సఫలీకృతం అయినట్లుగా కనిపించడం లేదు.

జీవన్ రెడ్డితో భేటీ అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. పార్టీ మారే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని జీవన్ రెడ్డిని కోరామని మంత్రి తెలిపారు. జీవన్ రెడ్డికి పార్టీ అండగా నిలబడే ఆలోచన చేస్తుందన్నారు. ఆయనతో చర్చించిన అంశాలను పార్టీ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. జగిత్యాల ప్రాంతానికి జీవన్ రెడ్డి పెద్దదిక్కు అని.. అభివృద్ధి కోసమే 10 మంది ఎమ్మెల్యేలను తీసుకున్నామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. జీవన్ రెడ్డి గురించి తెలంగాణ రాష్ట్రంలో తెలియని వారు ఎవరూ ఉండరన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గొంతుకగా ఉన్న నాయకుడు జీవన్ రెడ్డి అని అన్నారు. జీవన్ రెడ్డి బాధపడితే తాము బాధపడినట్లేనని అన్నారు. కాంగ్రెస్ నాయకులు మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు జీవన్ రెడ్డితో గతంలో మాట్లాడారని మంత్రి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను జీవన్ రెడ్డి తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ వివరాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి చెప్పారు. తన పట్ల పార్టీ పెద్దలు అనుసరిస్తున్న వైఖరిపై మంత్రుల వద్ద జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇన్ని అవమానాలు ఎదుర్కొంటూ పార్టీలో ఇంకా ఎందుకు కొనసాగాలని మంత్రులను ప్రశ్నించారు జీవన్ రెడ్డి. పార్టీలో గౌరవం లేనప్పుడు ఎందుకు ఉండాలని నిలదీశారు. దీంతో మీ సమస్యకు పరిష్కారం ఏంటని జీవన్ రెడ్డిని ప్రశ్నించారు మంత్రులు. స్పందించిన జీవన్ రెడ్డి.. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలను పక్కన పెట్టడమే తన సమస్యకు పరిష్కారమని మంత్రులకు తేల్చి చెప్పారు. ఇన్ని అవమానాలు భరిస్తూ పార్టీలో ఎందుకు ఉండాలని అడుగుతున్న తన కుమారులకు ఏం సమాధానం చెప్పాలని మంత్రులను అడిగిన జీవన్ రెడ్డి.. సారీ చెప్పి సమావేశాన్ని ముగించేశారు.

## కేంద్రీయ విద్యాలయాల్లో అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల

- బాలవాటిక, 1వ తరగతి అడ్మిషన్లకు మార్చి 20 నుంచి ఏప్రిల్ 2 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్
- 2 నుంచి 9వ తరగతి వరకు ఏప్రిల్ 2-8 మధ్య ఆఫ్‌లైన్ అప్లికేషన్లు
- బాలవాటిక మొదటి మెరిట్ లిస్ట్ ఏప్రిల్ 8న, 1వ తరగతి లిస్ట్ ఏప్రిల్ 9న విడుదల
- మొత్తం అడ్మిషన్ ప్రక్రియ జూలై 31, 2026 వరకు కొనసాగింపు..

తెలంగాణ బ్యూరో ప్రతినిధిః 2026-27: దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియను కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అధికారికంగా ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఈ పాఠశాలలు నాణ్యమైన విద్య, సీబీఎస్ఈ సిలబస్, క్రమశిక్షణకు ప్రసిద్ధి చెందినవి. దీంతో ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా సీట్ల కోసం భారీ పోటీ ఉండనుంది. ఈ నోటిఫికేషన్ ప్రకారం బాలవాటిక నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఇందులో భాగంగా ఒకటో తరగతి (క్లాస్ 1), బాలవాటిక అడ్మిషన్లకు మార్చి 20 ఉదయం 10 గంటల నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. వీటిని ఏప్రిల్ 2 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇక 2వ తరగతి నుంచి 9వ తరగతి వరకు, బాలవాటిక-2 ప్రవేశాలకు ఏప్రిల్ 2 నుంచి ఏప్రిల్ 8 వరకు ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ నిర్వహించనున్నారు. మెరిట్ జాబితాల విడుదలకు కూడా తేదీలు ఖరారు చేశారు. బాలవాటిక మొదటి జాబితా ఏప్రిల్ 8న, ఒకటో తరగతి మొదటి జాబితా ఏప్రిల్ 9న విడుదల కానుంది. అవసరాన్ని బట్టి ఏప్రిల్ 16, 21 తేదీల్లో రెండో, మూడో జాబితాలు ప్రకటిస్తారు. మొత్తం అడ్మిషన్ ప్రక్రియ జూలై 31, 2026తో ముగుస్తుంది. విద్యార్థుల వయోపరిమితి కూడా స్పష్టంగా నిర్దేశించారు. మార్చి 31, 2026 నాటికి బాలవాటిక-1కి 3 నుంచి 4 సంవత్సరాల మధ్య, బాలవాటిక-2కి 4 నుంచి 5 సంవత్సరాల మధ్య, బాలవాటిక-3కి 5 నుంచి 6 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి. ఒకటో తరగతికి కనీసం 6 సంవత్సరాలు పూర్తి అయి ఉండాలి. ఏప్రిల్ 1న జన్మించిన పిల్లలను కూడా అర్హులుగా పరిగణిస్తారు. దివ్యాంగులకు నిబంధనల ప్రకారం వయోసడలింపు ఉంటుంది. రిజర్వేషన్ విధానం ప్రకారం ఎస్సీకి 15%, ఎస్టీకి 7.5 %, ఓబీసీ (ఎన్‌సిఎల్)కు 27%, దివ్యాంగులకు 3% సీట్లు కేటాయిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఎక్స్ సర్వీస్‌మెన్ పిల్లలకు అవకాశం ఉంటుంది. ఒకటో తరగతి, బాలవాటిక అడ్మిషన్లకు కేవలం ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేయాలి. పై తరగతులకు సంబంధించి ఆయా కేంద్రీయ విద్యాలయాల్లో ఖాళీల ఆధారంగా నేరుగా స్కూల్‌కు వెళ్లి ఆఫ్‌లైన్ ద్వారా అప్లై చేయాలి. 11వ తరగతి అడ్మిషన్లు పదో తరగతి ఫలితాల తర్వాత ప్రారంభమవుతాయి. దరఖాస్తు చేసేటప్పుడు విద్యార్థి జనన ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ, కుల ధృవీకరణ (వర్తించే వారికి), ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ సర్టిఫికేట్, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు వంటివి అవసరం. తల్లిదండ్రులు దరఖాస్తులో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలని, డాక్యుమెంట్ వెరిఫికేషన్ కఠినంగా ఉంటుందని అధికారులు సూచించారు.


### మానవ అక్రమ రవాణా బండారం బట్టబయలు

**ఒక్కో మహిళకు రూ. 2.5 లక్షల చొప్పున అమ్మకాలు**

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో మానవ అక్రమ రవాణా మరోసారి వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. అమాయక గిరిజన యువతులను లక్ష్యంగా చేసుకున్న అంతరాష్ట్ర ముఠా, పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి ఇతర రాష్ట్రాలకు అమ్మేస్తున్న దారుణం బయటపడింది. తాజాగా బెజ్జూర్ మండలంకు చెందిన ఇద్దరు గిరిజన యువతులను మధ్యప్రదేశ్‌కు అక్రమంగా విక్రయించిన కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంచిర్యాలలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న ఈ యువతులను టార్గెట్ గా చేసుకుని ముఠా సభ్యులు మోసం చేసినట్లు విచారణలో తేలింది.

ఈ కేసులో చెన్నూరు మండలం కిష్టంపేటకు చెందిన ప్రశాంత్, సవిత దంపతులు, అలాగే సిరోంచాకు చెందిన మహేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు రాహుల్ పరారీలో ఉన్నాడు. ఒక్కో యువతిని రూ.2.50 లక్షలకు విక్రయించి, డబ్బులను నలుగురు సభ్యులు పంచుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. గతేడాది జూన్‌లో ఈ యువతులు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. అనంతరం సెప్టెంబర్‌లో అదృశ్యం కేసు నమోదు కాగా, దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాధితులను రక్షించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు వ్యవసాయం తప్ప జీవనాధారం లేని పరిస్థితిని దుర్వినియోగం చేస్తూ.. "ఉద్యోగం, మంచి జీవితం, పెళ్లి" అంటూ మోసగిస్తున్న ఈ ముఠాలు గిరిజన మహిళలను అంగట్లో సరుకుల్లా అమ్మేస్తున్నాయి. మైనర్ బాలికలు, వివాహితులు, ఒంటరి మహిళల కోసం వేర్వేరు రేట్లు నిర్ణయించి అక్రమ రవాణా కొనసాగిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇదే జిల్లాలో గతంలోనూ ఇలాంటి కేసులు నమోదయ్యాయి. కొన్ని ముఠాలు మహిళలను మధ్యప్రదేశ్ కు తరలించి వ్యభిచారంలోకి నెట్టిన ఘటనలు బయటపడ్డాయి. పోలీసులు ఈ ముఠా కార్యకలాపాలపై లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

# ఇంకెంత కాలం మోసం



- బీసీలు తిరగబడే రోజులు వచ్చాయి
- హక్కులు కావాలంటే.. అణచివేస్తున్న పాలకులు
- రాజ్యాధికారంలో వాటా లేదు.. ఆర్థికంగా చేయూత లేదు
- బడ్జెట్‌లో బీసీలకు మొండి చెయ్యి
- అన్యాయం - దగా - బీసీ వ్యతిరేక వైఖరి మార్చుకోవాలి
- ప్రభుత్వ వైఖరిపై 14 బి.సి సంఘాల సమావేశంలో బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆగ్రహం

తెలంగాణ బ్యూరో ప్రతినిధిః దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచిపోయినా..ఇంకా బీసీలను అన్ని రంగాల్లో అణచివేస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పాలకుల పై ధ్వజమెత్తారు. గత 50 ఏళ్లకు పైగా రాజ్యాధికారంలో వాటా ఇవ్వాలని పోరాటం చేస్తున్నా..పాలకులకు కనువిప్పు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో బీసీలకు తీరని అన్యాయం చేశారని 14 బీసీ సంఘాలు ప్రభుత్వంపై ధ్వజమెత్తాయి. రాష్ట్రంలో ఈరోజు బీసీ ఉద్యమం బీసీ వాదం బలంగా ఉంది. అయినప్పటికీ బీసీలు అంటే భయం లేకుండా పోయిందని విమర్శించారు. శనివారం 14 సంఘాల అత్యవసర జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డా. ర్యాగ అరుణ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ అధ్యక్షత సమావేశం జరిగింది.

బడ్జెటుపై సమీక్షా జరిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. రాష్ట్రంలో బీసీ బడ్జెట్ పెంచాలని ధర్నాలు, ప్రదర్శనలు, సమావేశాలు జరిపి ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయం. మొత్తం అసెంబ్లీ ప్రవేశపెట్టిన మొత్తం బడ్జెట్ లో 3లక్షల 24వేల కోట్లల్లో బీసీలకు కేవలం 12.511 కోట్లు మాత్రమే కేటాయించి తీవ్ర అన్యాయం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానంలో ప్రతి సంవత్సరం 20,000 కోట్లు కేటాయిస్తామని మరియు అలాగే కామారెడ్డి డెకరేషన్ లో కుడా ప్రకటించారు.

3సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. కానీ ఇంతవరకు వాగ్దానం నెరవేర్చలేదు. అలాగే కొత్త స్కీములు పెట్టలేదు. కొనసాగుతున్న స్కీములకు బడ్జెట్ పెంచలేదు. యదా తదాశీగా రోటీన్ గా బడ్జెట్ పెట్టారు. కానీ బీసీల పట్ల ఎలాంటి ప్రగతి పురోగతి లేదు.ఒక వైపు స్థానిక సంస్థలలో బి.సి.లకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించి దాని పై శ్రద్ధ తీసుకోవడం లేదు. ఇంకొక వైపు తమ చేతుల్లో యున్న బడ్జెటు పెంచకుండ బి.సి వ్యతిరేక వైఖరి అవలంభిస్తున్నారని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన వాగ్దానాలకు ఒక్క దానికి కూడా బడ్జెటు కేటాయించకుండ బి.సి,లను అణచి పెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం అడుగడుగునా బీసీ వ్యతిరేక ఆ చర్యలు పాల్పడుతుందని విమర్శించారు.

ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికలలో ఒకటి కూడా బీసీలకు ఇవ్వలేదు. సమాచార కమిషన్ల 6 మందిని నియమిస్తే ఒకటి కూడా బీసీలకు ఇవ్వకుండా అన్యాయం చేశారు. కార్పొరేషన్ చైర్మన్లలను 56శాతం జనాభా గల బి.సి.లకు బీసీలకు 15 శాతం ఇవ్వలేదు. మంత్రివర్గంలో కేవలం బీసీలు ముగ్గురు మాత్రమే ఉన్నారు. రాష్ట్రంలో దాదాపు 10లక్షలాదిమంది బీసీ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తులు చేసుకొని వేచి చూస్తున్నారు. వీరికి సబ్సిడీ రుణాలు ఇవ్వడానికి దాదాపు 8వేల కోట్లు కావాలని కోరారు. దీనికి బడ్జెటు పెంచాలని కోరారు.

ఫీజు రియంబర్స్ మెంట్ పథకం బకాయిలకు బడ్జెట్ కేటాయించకుండా బీసీలు ఉన్నత విద్యా చదవకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఎస్సీ/ ఎస్టీ/ మైనారిటీ విద్యార్థులకు పూర్తి ఫీజులు ఇస్తూ కేవలం బీసీ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు. ఎన్నికల వాగ్దానంలో పూర్తి ఫీజులు ఇస్తామని వాగ్దానం చేశారు. కానీ ఈ వాగ్దానం తగ్గట్లు బడ్జెట్ కేటాయింపు లేదు. ఈ బడ్జెటును సమీక్షించి ఎన్నికల వాగ్దానం ప్రకారం బడ్జెటు 20 వేల కోట్లకు పెంచాలి. బి.సి కార్పొరేషన్, బి.సి కుల ఫెడరేషన్లకు 10 వేల కోట్లు కేటాయించాలి. ఒక్కొక్క బి.సి కుటుంబానికి 20 లక్షల రూపాయలు, 80 శాతం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి. బడ్జెటులో గురుకులాలకు, హాస్టళ్ళలకు స్థలాలకు బడ్జెటు కేటాయించడం లేదు. కేటాయించిన ప్రభుత్వ స్థలాలను కూడా ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు అధికారులు లంచాలు తిని దారదత్తం చేస్తున్నారు. కానీ చదువుకొని భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ లు, డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు కావలసిన విద్యార్థులను బందెల దొడ్డిలో పశువులను తొలినట్లు ఒక్కొక్క రూంలో 20 నుంచి 50 మందిని వుంచుతున్నారు. విద్యార్థుల భవిష్యత్ దెబ్బ తీస్తున్నారు.

ఇదేం న్యాయం? బలహీన వర్గాలను చిన్నచూపు చూస్తారా? అని ప్రశ్నించారు. బీసీ కార్పొరేషన్ కు 16 బి.సి కుల ఫెడరేషన్కు కేటాయించిన బడ్జెట్ ఏ మూలకు సరిపోదని అన్నారు.

ఈ సమావేశంలో 14 బి.సి సంఘాల నాయకులూ డా. ర్యాగ అరుణ్ కుమార్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ జాతీయ బి.సి సంక్షేమ సంఘం నీల వెంకటేష్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణా బి.సి సంక్షేమ సంఘం, జిల్లపల్లి అంజి - రాష్ట్ర అధ్యక్షులు- రాష్ట్ర యువజన సంఘం, అనంతయ్య అధ్యక్షులు బి.సి ఐఖ్య వేదిక, రాజేందర్ అధ్యక్షులు -తెలంగాణా బి.సి సంఘం, శివ కుమార్ కన్వీనర్ తెలంగాణా బి.సి విద్యార్థి సంఘం, నిఖిల్ ప్రధాన కార్యదర్శి తెలంగాణా బి.సి విద్యార్థి సంఘం, అశిష్ గౌడ్, తెలంగాణా బి.సి యువజన సంఘం మరియు వివిధ కులసంఘాల నాయకులూ బితదితరులు పాల్గొన్నారు.



# కలర్స్

LIFE IS A RAINBOW



# హిందూ మహాసముద్రానికి విస్తరిస్తున్న యుద్ధం

**ఇరాన్ -- అమెరికా మధ్య జరుగుతున్న ప్రస్తుత యుద్ధం.. హిందూ మహాసముద్రానికి విస్తరించడం సంచలనంగా మారింది. ఇరాన్ మొదటిసారిగా మధ్యప్రాచ్యానికి వెలుపల ఉన్న అమెరికా-బ్రిటన్ సైనిక స్థావరంపై దాడి చేసింది. డియెగో గార్సియా  లక్ష్యంగా క్షిపణులను ప్రయోగించింది. పశ్చిమ ఆసియాలో రగులుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు సముద్ర గర్భంలో పెను విధ్వంసానికి దారితీశాయి. ఇరాన్ మరియు అమెరికా మధ్య కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం తాజాగా హిందూ మహాసముద్రంలో రక్తాన్ని చిందించింది. ఇరాన్ తన భూభాగం నుండి రెండు ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణులను  డియెగో గార్సియాపైకి లాంచ్ చేసినట్లు అమెరికాకు చెందిన వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. మరిన్ని వివరాలలోకి వెళితే....**

పశ్చిమాసియా యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చబోతోందా? మూడు వారాలుగా జరుగుతున్న యుద్ధం ముందు.. ముందు మరింత ఉద్రిక్తతలకు దారి తీయబోతుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇందుకు తాజాగా ఇరాన్ ప్రయోగించిన క్షిపణినే కారణంగా అంతర్జాతీయ మీడియా కోడైకూస్తోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ మొదట నుంచి అనేక అనుమానాలు వ్యక్తం చేస్తూ వస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్‌ను చేరుకునే క్షిపణులను ఇరాన్ తయారు చేస్తోందని ట్రంప్, నెతన్యాహు ఆరోపిస్తూ వచ్చారు. అన్నట్టుగానే తాజాగా ఆ అనుమానం నిజమైంది. హిందూ మహా సముద్రంలోని చాగోస్ దీవుల్లోని డియాగో గార్సియాలో ఉన్న అమెరికా-బ్రిటన్‌కు సంయుక్తంగా ఉన్న సైనిక స్థావరంపై ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే రెండింటిలో ఏ క్షిపణి కూడా లక్ష్యాన్ని ఛేదించలేదు. ఒకటి మార్గమధ్యలో విఫలం కాగా.. ఇంకొక క్షిపణిని అమెరికా యుద్ధ నౌక నుంచి ప్రయోగించిన ఇంటర్‌సెప్టర్ అడ్డుకుంది. అయితే బాలిస్టిక్ క్షిపణి ఏమైంది? అనేది స్పష్టత రాలేదు. అమెరికా అధికారులను ఉటంకిస్తూ "వాల్ స్ట్రీట్ జర్నల్" తన కథనంలో పేర్కొంది. ఈ ఘటనతో ప్రపంచ దేశాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ఇరాన్ భూభాగం నుంచి డియాగో గార్సియా సైనిక స్థావరానికి దాదాపు 4,000 కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే ఇప్పటి వరకు ఇరాన్ దగ్గర 2,000-3,000 కిలోమీటర్ల దూరాన్ని ఛేదించగల క్షిపణులు మాత్రమే ఉన్నాయని ప్రపంచం భావించింది. కానీ తాజా ఘటనతో టెహ్రాన్ దగ్గర 4,000 కిలోమీటర్ల లక్ష్యాన్ని ఛేదింగల బాలిస్టిక్ క్షిపణులు ఉన్నాయని తేలిపోయింది. ఈ పరిణామం పశ్చిమ దేశాలను మరింత ఆందోళనలకు గురి చేస్తున్నాయి.అయితే ఈ ఘటనపై ఇప్పటి వరకు అధికారికంగా పెంటగాన్ స్పందించలేదు. ఏ అధికారి కూడా అధికారికంగా ధృవీకరించలేదు. ఒకవేళ ఈ వార్త నిజమైతే మాత్రం.. ఇరాన్ దక్షిణాసియాను కూడా ఛేదించగలదని అర్థమవుతోంది. ప్రస్తుత యుద్ధాన్ని ఇరాన్ మరింత తీవ్రతరం చేసి పశ్చిమ దేశాలకు స్ట్రాంగ్ సందేశం పంపే అవకాశం ఉందని మాజీ కేంద్ర మంత్రి మనీష్ తివారీ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.



**దాడి ప్రభావం ఏంటంటే?**

అయితే ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల వల్ల డియెగో గార్సియా సైనిక స్థావరానికి ఎలాంటి నష్టం జరగలేదని వాల్ స్ట్రీట్ జర్నల్ స్పష్టం చేసింది. కొన్ని నివేదికల ప్రకారం.. ఒక క్షిపణి గాలిలోనే విఫలం కాగా, రెండో దానిని అమెరికా యుద్ధనౌక తన ఎస్ఎం -3 ఇంటర్‌సెప్టర్ ద్వారా అడ్డుకుంది. ఫలితంగా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు. మరోవైపు ఈ దాడికి సంబంధించి పెంటగాన్ నుంచి ఇప్పటివరకూ ఒక్క అధికారిక ప్రకటన వెలువడకపోవడం గమనార్హం.

## డియెగో గార్సియాపై దాడి ఎందుకు?



అమెరికా బాంబర్లు తమ స్థావరాల నుండి ఇరాన్‌పై దాడులు చేయడానికి బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ అనుమతి ఇచ్చిన కొద్ది గంటల్లోనే ఇరాన్ ఈ ప్రతీకార చర్యకు పాల్పడింది. డియెగో గార్సియా అనేది హిందూ మహాసముద్రంలో అమెరికాకు ఉన్న అత్యంత కీలకమైన, సురక్షితమైన సైనిక స్థావరం. ఇక్కడి నుండే అమెరికా తన సుదూర లక్ష్యాలపై దాడులు చేసే బాంబర్లను నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలోనే దానిని దెబ్బకొట్టేందుకు ఇరాన్ ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు తెలుస్తోంది. అయితే ఈ దాడికి ముందే బ్రిటన్ ను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ హెచ్చరించారు. బ్రిటన్ చర్యలు తమపై దురాక్రమణకు సమానమని పేర్కొన్నారు. దీనికి తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

**4,000 కి.మీ దూరంలో..**

అయితే ఇరాన్ తన క్షిపణుల పరిధి కేవలం 2,000 కిలోమీటర్లు మాత్రమేనని గతంలో ప్రకటించింది. కానీ ఇరాన్ నుండి సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న డియెగో గార్సియాను లక్ష్యంగా చేసుకోవడంతో వారి క్షిపణి సామర్థ్యం ప్రపంచం ఊహించిన దానికంటే చాలా ఎక్కువని స్పష్టమైంది. దీన్ని బట్టి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ను ఇది కచ్చితంగా ఇబ్బందుల్లోకి నెట్టవచ్చని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఈ దాడిపై కేంద్ర మాజీ మంత్రి మనీష్ తివారీ ఎక్స్ వేదికగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హిందూ మహాసముద్రంలోని లోతట్టు ప్రాంతమైన డిగో గార్సియా ద్వీపాన్ని ఇరాన్ టార్గెట్ చేసిందన్న వార్తలు నిజమైతే.. పశ్చిమ దేశాలకు ఇది గట్టి హెచ్చరికేనని పేర్కొన్నారు. యుద్ధాన్ని మరింత విస్తరింపేజేసేందుకు తాము ఏమాత్రం వెనుకాడబోమన్న సంకేతాన్ని ఇరాన్ ఈ దాడి ద్వారా ఇచ్చినట్లైందని పేర్కొన్నారు.

**దుబాయ్‌లో డ్రోన్ కలకలం**

ఒకవైపు సముద్రంలో యుద్ధనౌక మునిగిపోగా, మరోవైపు దుబాయ్‌లోని అమెరికా రాయబార కార్యాలయం (జశీఅంబశ్రీఖ్వ) సమీపంలో ఇరాన్ డ్రోన్లతో దాడి జరిగింది. పార్కింగ్ ఏరియాలో జరిగిన ఈ పేలుడు వల్ల భారీగా మంటలు చెలరేగినప్పటికీ, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు ధృవీకరించారు. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ వరుస దాడులకు దిగుతుండటంతో మధ్యప్రాచ్యంలో హై అలర్ట్ ప్రకటించారు.

**ప్రపంచ మార్కెట్‌పై ప్రభావం**

ఈ ఘర్షణల వల్ల ముడి చమురు  ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. అంతర్జాతీయ సరఫరా దారుల్లో ఆందోళన మొదలైంది. ముఖ్యంగా భారత్ వంటి దేశాలకు ఇంధన దిగుమతులు మరియు వాణిజ్య రవాణాపై ఈ యుద్ధ ప్రభావం పడే అవకాశం ఉంది.  హిందూ మహాసముద్రం వంటి ప్రశాంతమైన జలాల్లో కూడా యుద్ధ ఛాయలు అలుముకోవడం ప్రపంచ శాంతికి సవాలుగా మారింది. అమెరికా తన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ద్వారా ఇరాన్ నౌకాదళాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తామని హెచ్చరిస్తోంది. శ్రీలంక తీరానికి సమీపంలో అంతర్జాతీయ జలాల్లో ప్రయాణిస్తున్న ఇరాన్‌కు చెందిన 'ఐఆర్ఐఎస్ దేనా'  అనే యుద్ధనౌకను అమెరికాకు చెందిన సబ్ మెరైన్ టార్పెడోలతో దాడి చేసి ముంచివేసింది.

**ఇరాన్ యుద్ధనౌకపై ఈ దాడి**

విశాఖపట్నంలో జరిగిన బహుపాక్షిక నౌకాదళ విన్యాసాల్లో  పాల్గొని తిరిగి వెళ్తున్న ఇరాన్ యుద్ధనౌకపై ఈ దాడి జరిగింది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ ఈ విషయాన్ని ధృవీకరిస్తూ, ఇది రెండో ప్రపంచ యుద్ధం తర్వాత టార్పెడోతో శత్రు నౌకను ముంచిన మొదటి ఉదంతమని పేర్కొన్నారు. ఈ దాడిలో సుమారు 80 మందికి పైగా ఇరాన్ నావికులు మరణించినట్లు సమాచారం. శ్రీలంక నౌకాదళం సహాయక చర్యలు చేపట్టి సుమారు 32 మందిని రక్షించింది

**'మయూరీ నారీ'పై దాడి**

యూఏఈ నుంచి గుజరాత్‌కు బయల్దేరిన థాయిలాండ్ కార్గో షిప్ 'మయూరీ నారీ'పై ఇరాన్ భీకర దాడికి దిగింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని ఖలీఫా పోర్టు నుంచి సరుకుతో బయల్దేరిన ఈ నౌకను వ్యూహాత్మకంగా కీలకమైన హోర్ముజ్ జలసంధి వద్ద ఇరాన్ బలగాలు లక్ష్యంగా చేసుకున్నాయి. సముద్ర మార్గంలో ప్రయాణిస్తున్న సమయంలో ఆకస్మికంగా జరిగిన ఈ దాడితో నౌకలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ తామే దాడి చేశామని ఇరాన్ అధికారికంగా ప్రకటించడం అంతర్జాతీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఈ దాడి ప్రభావం అంతర్జాతీయ సముద్ర రవాణా మార్గాలపై పడే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. ఇలాంటి దాడులు వాణిజ్య రంగాన్ని దెబ్బతీస్తాయి. ఇరాన్ వైఖరి వల్ల సముద్ర ప్రయాణాలు భారంగా మారుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ ఘటనపై మరిన్ని నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి మయూరీ నారీ నౌక భద్రతపై కంపెనీ యాజమాన్యం దృష్టి సారించింది. సిబ్బందిని స్వదేశానికి చేర్చే ప్రయత్నాలు వేగవంతం చేశారు.

**95 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు రవాణా**

ఇరాన్‌లోని అతిపెద్ద చమురు క్షేత్రాలైన అహ్వాజ్, మారున్, గచ్సరన్ నుంచి పైప్‌లైన్‌లు నేరుగా ఖార్గ్ స్టోరేజ్ ట్యాంకుల్లోకి వెళ్తాయి. ఇక్కడి నుంచి ప్రతి సంవత్సరం దాదాపు 95 కోట్ల బ్యారెళ్ల ముడి చమురును రవాణా చేస్తారు. ఇరాన్ ప్రభుత్వానికి, సైన్యానికి నిధులు సమకూర్చడంలో ఖార్గ్ ద్వీపం కీలకం. ఇరాన్ ఖార్గ్‌పై నియంత్రణ కోల్పోతే, ఆ దేశం పనిచేయడం కష్టమవుతుంది.

1960, 1970లలో ఇరాన్ చమురు విస్తరణలో భాగంగా ఖార్గ్ ద్వీపం కీలకంగా మారింది. అమెరికా, ఇజ్రాయెల్ ఇప్పటి వరకు ఖార్గ్ ద్వీపంపై దాడిలో జాగ్రత్తగా వ్యవహరించాయి. అయితే తాజాగా ఆ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి యూఎస్ భారీగా క్షిపణులు ప్రయోగించింది. శుక్రవారం జపాన్ నౌక ఖూూ ట్రిపోలి దాని 2,500 మంది మెరైన్‌లతో పాటు ఈ ద్వీపానికి పంపింది.

**బి.వి.రమణ, 94407 40015**

## చిన్న ద్వీపం పెద్ద పాత్ర



బుషెహర్ ప్రావిన్స్ ప్రధాన భూభాగానికి 28 కిలోమీటర్ల దూరంలో.. పెర్షియన్ గల్ఫ్ ఉత్తర భాగంలో ఉన్న  ద్వీపం ఖార్గ్. ఇది ఎనిమిది కిలోమీటర్ల పొడవు, ఐదు కిలోమీటర్ల వెడల్పు విస్తీర్ణంలో ఉంటుంది. డొనాల్డ్ ట్రంప్ ఖార్గ్ ద్వీపాన్ని ఇరాన్ "కిరీట రత్నం" అని పిలిచినప్పటికీ, కొన్ని సంవత్సరాల క్రితం ప్రముఖ ఇరానియన్ రచయిత జలాల్ అల్-ఎ-అహ్మద్ ఈ ద్వీపాన్ని "పర్షియన్ గల్ఫ్ అనాథ ముత్యం" అని పిలిచారు. ఖార్గ్ ద్వీపంలోని మౌలిక సదుపాయాలు, చమురు నిల్వ ట్యాంకులు, లోడింగ్ టెర్మినల్స్, పైప్‌లైన్‌లు ముడి చమురు రంగానికి కీలకంగా పనిచేస్తాయి. ఈ టెర్మినల్ మూడు ప్రధాన ఆఫ్‌షోర్ స్టేషన్స్ అబూజర్, ఫోరౌజాన్, డోరూడ్ నుంచి ముడి చమురును సేకరించి, దానిని పైపులైన్ల నెట్‌వర్క్ ద్వారా సముద్రతీరంలోని ప్రాసెసింగ్ యూనిట్లకు రవాణా చేసి, నిల్వ చేస్తారు. అక్కడి నుంచి ప్రపంచ మార్కెట్లకు రవాణా చేస్తారు.

**ఖార్గ్ ద్వీపంపై దాడి**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. అమెరికా సైన్యం ఖార్గ్ ద్వీపంలోని లక్ష్యాలపై భారీగా బాంబు దాడులు చేశారన్నారు. ద్వీపంలోని చమురు కేంద్రాలను ధ్వంసం చేశామన్నారు. "ఖార్గ్ ద్వీపంలోని చమురు మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తున్నాం. ఇరాన్ లేదా మరెవరైనా హోర్ముజ్ జలసంధి మార్గంలో నౌకలను రాకుండా జోక్యం చేసుకోవడానికి ప్రయత్నిస్తే..దాడి మరింత తీవ్రంగా ఉంటుంది"  అని ట్రంప్ హెచ్చరించారు.ప్రపంచంలోని మొత్తం చమురులో 20 శాతం రవాణా అయ్యే కీలకమైన హర్మ్యూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంచింది. దీంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసింది. చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లకు పెరిగాయి. పెట్రోలియం ఎగుమతి చేసే దేశాల సంస్థ లో నాల్గో అతిపెద్ద ముడి చమురు ఉత్పత్తిదారుగా ఉన్న ఇరాన్..  యుద్ధం కొనసాగినంత కాలం గల్ఫ్ దేశాల నుంచి ఒక్క లీటరు చమురు కూడా ఎగుమతి చేయనివ్వమని ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది.

## ముంబై, సీఎస్‌కే కాదు.. ఆర్‌సీబీదే టైటిల్..



ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) విజేతగా నిలుస్తుందని టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంచనా వేసాడు. ప్రస్తుతం ఉన్న జట్టుతో ఆర్‌సీబీ వరుసగా మరో రెండేళ్లు టైటిళ్లు గెలవవచ్చని అభిప్రాయపడ్డాడు.
ఆర్‌సీబీ దగ్గర అత్యుత్తమైన విదేశీ ఆటగాళ్ల కాంబినేషన్ ఉందని చెప్పుకొచ్చాడు. జోష్ హాజెల్ వుడ్ అందుబాటులోకి వచ్చి, ఫిల్ సాల్ట్ ఫామ్ అందుకుంటే ఆర్‌సీబీకి తిరుగుండదని పేర్కొన్నాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఆర్‌సీబీ జట్టును విశ్లేషించిన అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.
ఆర్‌సీబీదే టైటిల్..
'ఐపీఎల్ టైటిల్ గెలవడం ఏ జట్టుకైనా అంత ఈజీ కాదు. ఇప్పుడున్న జట్టుతో ఆర్‌సీబీ టైటిల్ నిలబెట్టుకుంటుందని భావిస్తున్నా. జట్టు పునర్నిర్మాణంలో ఆర్‌సీబీ చాలా తెలివిగా వ్యవహరించింది. జోష్ హాజెల్ వుడ్ అందుబాటులోకి వచ్చి.. ఫిల్ సాల్ట్ ఫామ్ అందుకుంటే ఆర్‌సీబీకి తిరుగుండదు. ఆర్‌సీబీ బెంచ్ కూడా చాలా బలంగా ఉంది. హాజెల్ వుడ్ గైర్హాజరీలో ఆర్‌సీబీ సాల్ట్, జాకోబ్ బెథెల్‌ను ఆడించవచ్చు.
వేలంలో రూ.7 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వెంకటేష్ అయ్యర్ ఆరంభంలో తుది జట్టులో ఆడతాడని నేను అనుకోవడం లేదు. బ్రదర్.. ఒకసారి వారి విదేశీ ఆటగాళ్లను చూడండి. సాల్ట్, డేవిడ్, షెపర్డ్, బెథెల్. మై గాడ్! ఇది ఒక అత్యుత్తమ విదేశీ ఆటగాళ్ల కాంబినేషన్. బహుశా టోర్నమెంట్‌లోనే ఇది ఒక బెస్ట్ కాంబినేషన్ కావచ్చు.
జాకోబ్ బెథల్‌కు చోటు..
హాజెల్ వుడ్ లోటును యష్ దయాల్‌తో భర్తీ చేయవచ్చు. అతను కూడా లేకపోతే కాస్త కష్టమవుతుంది. ఆర్‌సీబీ వద్ద జాకబ్ బెథల్, జాకడ డఫీ, మంగేష్ యాదవ్ ఉన్నారు. ఆర్‌సీబీ ఆడే తొలి మ్యాచ్‌లో ఈ ముగ్గురి మధ్య గట్టి పోటీ ఉండబోతుంది.
ఒకవేళ జాకబ్ బెథెల్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని ఆర్‌సీబీ భావిస్తే.. విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, రజత్ పటీదార్‌ల్లో ఎవరైనా.. జాకబ్ బెథెల్‌ను కచ్చితంగా ఆడించాలి. అతన్ని ఆడించకుండా ఎలా ఉంటాం? అని భావిస్తే.. జాకోబ్ బెథెల్ జట్టులోకి వస్తాడు. అప్పుడు మంగేష్ యాదవ్ తుది జట్టులో ఆడుతాడు.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.
అశ్విన్ అంచనా వేసిన ఆర్‌సీబీ తుది జట్టు:
విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, జాకబ్ బెథెల్, రజత్ పాటిదార్, జితేష్ శర్మ, టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, మంగేష్ యాదవ్, యష్ దయాల్, సుయాష్ శర్మ(ఇంపాక్ట్ ప్లేయర్).

## మైక్ ఆన్‌లోనే ఉంది గురూ..

### బ్రావో వ్యాఖ్యలు వైరల్



కోల్‌కతా నైట్‌రైడర్స్ మెంటార్ డ్వేన్ బ్రావో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రధాన కోచ్ అభిషేక్ నాయర్, అసిస్టెంట్ కోచ్ షేన్ వాట్సన్, కెప్టెన్ అజింక్య రహానెతో కలిసి బ్రావో ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చాడు. ఈ క్రమంలో బ్రావో స్పందిస్తూ.. "వీరిద్దరూ నాకు ఫోన్ చేశారు. అప్పుడు నేను ఇద్దరితో ఉన్నా" అని ఏదో చెబుతుండగా.. అజింక్య రహానె వారించాడు. మైక్ ఆన్‌లోనే ఉందని గుర్తుచేశాడు. దీంతో బ్రావో అవాక్కై.. అక్కడితో ఆపేశాడు. అయితే, సోషల్ మీడియాలో బ్రావోపై కొందరు విమర్శలు చేస్తుండగా.. మరికొందరు అతడికి మద్దతుగా నిలిచారు.
"ఐపీఎల్ వంటి మెగా లీగ్‌కు వచ్చినప్పుడు హుందాగా ఉండాలి. మరీ ముఖ్యంగా ప్రెస్ కాన్ఫరెన్స్ సమయంలో మైక్ ఆన్‌లో ఉందా, లేదా అని కూడా చూసుకోరా? ఏం మాట్లాడినా అందుకు సరైన కారణం ఉండాలి. అభిమానులకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉంది"
"ప్రెస్ కాన్ఫరెన్స్‌కు కీలక వ్యక్తులు వచ్చారు. నా ఇంట్లో ఇద్దరు గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నారు అని బ్రావో చెప్పాడు. రహానె ఆపకపోయుంటే ఇంకేం మాట్లాడేవాడో? అప్పుడు అతడి ఫేస్ పూర్తిగా మాడిపోయింది. ఐపీఎల్‌కు ఇలాంటి మైండ్‌సెట్‌తో రావడం సిగ్గుచేటు"
"ఎందుకు బ్రావో వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుంటారు. అతడు ఇంటి వద్ద ఇద్దరు మహిళలు ఉన్నారని చెప్పాడు. వారు స్నేహితులు అయి ఉండొచ్చు కదా. కేవలం ఒక్క క్లిప్ ఆధారంగా జడ్జ్‌మెంట్ ఇచ్చేయకూడదు. అయితే ప్రస్తుత, మాజీ క్రికెటర్‌లు ఎవరైనా సరే ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలి"."మహిళల గురించి గతంలో ఇలాగే ఓ క్రికెటర్ అనుచితంగా మాట్లాడాడు. తర్వాత సారీ చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. అందుకే, పబ్లిక్‌గా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి".

## వాటన్నింటికీ దూరంగా ఉండు..

### వైభవ్ సూర్యవంశీకి కెప్టెన్ మాస్ వార్నింగ్..!



మార్చి 28 నుంచి ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ మొదలు కాబోతుంది. దీనికోసం అన్ని జట్లు వారి కొత్త సహచరులతో కలిసి ప్రాక్టీస్ మొదలు పెట్టేశాయి. కొత్త ఏడాది.. కొత్త సీజన్.. కొత్త అంచనాలు. ప్రతిసారి సీజన్ మొదలు కాకముందు నుంచే ఎన్నో ఎక్స్పెటేషన్స్. ఇందులో ఈసారి అందరి దృష్టి 14 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశిపై ఉందనడం ఎటువంటి అతిశయోక్తి లేదు. చిన్న వయసులోనే అద్భుతమైన బ్యాటింగ్ తో క్రికెట్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుకున్న ఈ ఎడమచేతి బ్యాట్స్‌మన్, భారీ సిక్సర్లు కొట్టడంలో ప్రత్యేక గుర్తింపును సంపాదించాడు.
2025 ఐపీఎల్ సీజన్‌కు రాజస్థాన్ రాయల్స్ రూ.1.1 కోట్ల భారీ మొత్తంతో వైభవ్ ను కొనుగోలు చేయడం అప్పుడు సంచలనం సృష్టించింది. అయితే మేనేజ్మెంట్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అతడు 7 మ్యాచ్‌ల్లో 252 పరుగులు సాధించి, 36 సగటుతో 206.56 స్ట్రైక్ రేట్‌తో అబ్బురపరిచాడు. జట్టులో సంజు శాంసన్ గాయపడితే అతడికి బదులుగా జట్టులోకి వచ్చిన వైభవ్.. ఆ అవకాశాన్ని అద్భుతంగా ఉపయోగించుకున్నాడు. గుజరాత్ టైటాన్స్ పై తన రెండో మ్యాచ్ లోనే ఏకంగా 35 బంతుల్లో శతకం బాది, ఐపీఎల్ చరిత్రలో అత్యంత పిన్న వయసులో సెంచరీ చేసిన ఆటగాడిగా, అలాగే అత్యంత వేగంగా శతకం సాధించిన భారతీయ ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.



# "ప్లేయర్‌గా వచ్చా.. కెప్టెన్‌గా తిరిగి వచ్చా"

- మార్చి 28 నుంచి 2026 సీజన్ ప్రారంభం
- చిన్నస్వామి స్టేడియంలో బెంగళూరుతో సన్ రైజర్స్
- ప్యాట్ కమిన్స్ గైర్హాజరీతో కొత్త కెప్టెన్ నియామకం
- ఇషాన్ కిషన్‌ను తాత్కాలిక కెప్టెన్‌గా ప్రకటించిన హైదరాబాద్

మార్చి 28 నుంచి ఐపీఎల్ 2026 సీజన్ మొదలు కాబోతోంది. ఇందులో భాగంగా బెంగళూరులోని చిన్న స్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , సన్ రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మొదటి మ్యాచ్ జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ గా ఆర్సిబి జట్టు బరిలోకి దిగనుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ పలు కారణాల వల్ల సీజన్ ఆరంభంలో పలు మ్యాచ్ లకు దూరం కానున్నారు.
దీంతో జట్టు యాజమాన్యం రెండు రోజుల క్రితం కొత్త కెప్టెన్ ను ప్రకటించింది. ఇషాన్ కిషన్ ను సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు తాత్కాలిక కెప్టెన్గా ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రెండుసార్లు టోర్నీ గెలిచిన జట్టును ఇషాన్ కిషన్ ఎలా ముందుకు తీసుకెళ్తాడు అని క్రికెట్ విశ్లేషకులు చర్చిస్తున్నాను. ఇదిలా ఉండగా.. తాజాగా సన్ రైజర్స్ హైదరాబాద్ ఇషాన్ కిషన్ పెట్టి కొత్త టీజర్ ను సోషల్ మీడియాలో విడుదల చేసింది.
ఇందులో "గత ఏడాది కొత్త చాప్టర్ మొదలైంది. ఇక్కడికి నేను ఒక ఆటగాడిగా వచ్చాను. కానీ ఈరోజు నేను మీ మనిషిగా తిరిగి వచ్చాను. అది కూడా ఆరెంజ్ ఆర్మీ కెప్టెన్ గా" అంటూ ఇషాన్ కిషన్ మాట్లాడడం వినవచ్చు. ఇక ఇదే వీడియోలో చివర్లో "ఇక స్టార్ట్ చేద్దామా.. అంటూ మిగతా జట్లకు ఓ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చేలా మెసేజ్ ఇచ్చాడు. అలాగే "ఫైర్ హెచ్చరిక" అంటూ ఎండ్ టైటిల్ తో యాజమాన్యం టీజర్ ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. చూడాలిమరి సన్ రైజర్స్ హైదరాబాద్ సీజన్ లో ఎలా ముందుకు వెళ్తుందో.

## టీ20లలో సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కురాలు



15 ఏళ్ల రువాండా క్రికెటర్ ఫానీ ఉటగుషిమనిండే మహిళల క్రికెట్‌లో చరిత్ర సృష్టించింది. ఆమె తన ా20 అంతర్జాతీయ (ా20×) డెబ్యూ మ్యాచ్‌లోనే సెంచరీ సాధించిన మొదటి మహిళగా నిలిచింది. నైజీరియా ఇన్విటేషనల్ విమెన్స్ ా20× టోర్నమెంట్‌లో, ఘనాతో జరిగిన మ్యాచ్‌లో (లాగోస్‌లోని తఫావా బాలెవా స్క్వేర్ క్రికెట్ ఓవల్‌లో, మార్చి 20, 2026) ఆమె 65 బంతుల్లో అజేయంగా 111 రన్స్ (17 ఫోర్లతో) కొట్టింది. ఈ భారీ ఇన్నింగ్స్‌తో రువాండా బలమైన స్కోరు సాధించి విజయం సాధించింది. అంతేకాకుండా, టీ20ఐలలో సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కురాలైన బ్యాట్స్‌మెన్‌గా కూడా ఆమె రికార్డు సృష్టించింది.
గతంలో, మహిళల టీ20ఐలో అరంగేట్రం మ్యాచ్‌లో అత్యధిక స్కోరును ఆస్ట్రేలియాకు చెందిన కరెన్ రోల్టన్ నెలకొల్పారు, ఆమె 2005లో ఇంగ్లాండ్‌పై 96లి పరుగులు చేశారు. టీ20ఐలో అత్యంత పిన్న వయస్కురాలైన సెంచరీని ఉగాండాకు చెందిన ప్రోస్కోవియా అలోకా నెలకొల్పారు, ఆమె 16 సంవత్సరాల 233 రోజుల వయస్సులో మాలిపై సెంచరీ సాధించారు.
పురుషుల టీ20ఐ క్రికెట్‌లో, నలుగురు బ్యాట్స్‌మెన్లు తమ అరంగేట్రంలోనే శతకాలు సాధించారు, కానీ వారిలో ఎవరూ పూర్తి స్థాయి సభ్య దేశానికి చెందినవారు కాదు. 2022లో ఫిలిప్పీన్స్‌పై అజేయంగా 108 పరుగులు చేసిన కెనడాకు చెందిన మాథ్యూ స్పూర్స్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. పురుషుల టీ20ఐలో శతకం సాధించిన అత్యంత పిన్న వయస్కుడైన బ్యాట్స్‌మెన్ ఫ్రాన్స్‌కు చెందిన గుస్తావ్ మెకాన్. మెకాన్ 18 సంవత్సరాల 280 రోజుల వయస్సులో ఈ ఘనతను సాధించాడు.
ఫ్యానీ ఉటాగుషిమానిండే శతకంతో రాణించడంతో, రువాండా తమకు కేటాయించిన 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. 19 బంతుల్లో 32 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టుకు నాయకత్వం వహించిన మెర్వెల్ ఉవాసే కూడా మరో ప్రధాన స్కోరర్‌గా నిలిచింది.
ఘనా బౌలింగ్ ఎంతగా చెల్లాచెదురైందంటే, వారు 25 వైడ్‌లతో సహా 28 అదనపు పరుగులు ఇచ్చారు. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఘనా పూర్తిగా ఒత్తిడికి లోనైనట్లు కనిపించింది. రువాండా బౌలర్లు క్రమంగా తమ పట్టును బిగించి, 20 ఓవర్లలో ఘనాను 8 వికెట్ల నష్టానికి కేవలం 88 పరుగులకే పరిమితం చేశారు. రువాండా ఈ మ్యాచ్‌ను 122 పరుగుల భారీ తేడాతో గెలుచుకుంది.

## ఐపీఎల్‌కు ముందే కేకేఆర్‌కు వరుస దెబ్బలు..

# మరో స్టార్ బౌలర్ దూరం..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026కు ముందు, మూడుసార్లు విజేతగా నిలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్టుకు సమస్యలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే హర్షిత్ రాణా ఈ టోర్నమెంట్ మొత్తానికి దూరమవ్వగా, ఇప్పుడు మరో ఎదురు దెబ్బ తగిలింది. స్టార్ పేసర్ ఆకాశ్ దీప్ సైతం ఈ సీజన్‌కు దూరం కానున్నాడు. గతేడాది అబుదాబిలో జరిగిన మినీ వేలంలో కేకేఆర్ జట్టు ఆకాశ్‌ను రూ. 1 కోటికి కొనుగోలు చేసింది. ఇప్పుడు ఆకాశ్ అందుబాటులో లేకపోవడం ఆ జట్టు బౌలింగ్ విభాగానికి పెద్ద దెబ్బగా మారనుంది. వాస్తవానికి.. ఆకాశ్ దీప్‌కు ముందే గాయమైంది. బెంగాల్ తరపున రంజీ ట్రోఫీ సెమీఫైనల్ ఆడుతున్నప్పుడే వెన్నునొప్పి (ూతీవంం తీముఖ్ఙఅశీఅ) బారిన పడ్డాడు. ఈ గాయం నుంచి కోలుకోవడానికి కనీసం 6 నుంచి 12 వారాల సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. మార్చి 18న కోల్‌కతాలో ప్రారంభమైన కేకేఆర్ ప్రీ-సీజన్ క్యాంప్‌కు గానీ, శుక్రవారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌కు గానీ ఆకాశ్ హాజరు కాలేదు. మరోవైపు.. శ్రీలంక పేసర్ మతీషా పతిరానా విషయంలోనూ ఇంత వరకు క్లారిటీ రాలేదు. రాణా భుజం గాయంతో బాధపడుతున్నాడు. ఈ సీజన్‌లో రాణా ఆడతాడా? లేదా? అనే అంశంపై సందిగ్ధం నెలకొంది. ఈ ఎదురు దెబ్బలతో ప్రస్తుతం కేకేఆర్ బౌలింగ్ విభాగంలో వైభవ్ అరోరా, ఉమ్రాన్ మాలిక్, బ్లెస్సింగ్ ముజరబానీ, కార్తీక్ త్యాగి మాత్రమే ఉన్నారు. ఇక ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు మేనేజ్మెంట్ కసరత్తు షురూ చేసింది. ఈడెన్ గార్డెన్స్‌లో నవదీప్ సైనీ, ఆకాష్ మధ్వాల్, సందీప్ వారియర్ వంటి ఆటగాళ్లతో ట్రయల్స్ నిర్వహిస్తోంది. ఈ నెల 29 ముంబైతో కేకేఆర్ తొలి మ్యాచ్‌ను ఎదుర్కోనుంది. అంతలోపు మేనేజ్మెంట్ ఏం చేస్తుందో వేచి చూడాలి.ఇప్పటికే హర్షిత్ రాణా రూపంలో ఓ పేసర్‌ను కోల్పోయిన కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు మరో షాక్ తగిలింది. గత వేలంలో తీసుకున్న ఆకాశ్ దీప్ కూడా లీగ్‌లో ఆడటం కష్టమేనని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం అతడు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో చికిత్స పొందుతున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌కు మరో వారం రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో అతడు కోలుకుని వచ్చి ఆడటం కష్టమేనని క్రికెట్ వర్గాలు తెలిపాయి. ఆకాశ్‌కు గాయాలు కొత్తేమీ కాదు. 2022లో తొలిసారి ఐపీఎల్‌లో అడుగు పెట్టిన అతడు.. ఇప్పటి వరకు ఆడింది కేవలం 14 మ్యాచులే కావడం గమనార్హం. గత ఐపీఎల్‌లో ఆకాశ్‌ను కేకేఆర్ రూ. కోటికే సొంతం చేసుకుంది. ఆకాశ్ దీప్ గైర్హాజరుపై కేకేఆర్ ప్రధాన కోచ్ అభిషేక్ నాయర్ స్పందించలేదు. కానీ, హర్షిత్ రాణా స్థానంలో మరొకరిని చూస్తామని వెల్లడించాడు. "హర్షత్ రాణా లేకపోవడం మాకు నష్టమే. జట్టులో అతడు కీలక పాత్ర పోషించాడు. గత కొన్ని రోజులుగా మేం ప్రత్యామ్నాయ బౌలర్లను చూస్తూనే ఉన్నాం. ఎవరు సరిపోతారనే దానిపై విశ్లేషిస్తున్నాం. ఇప్పటి వరకైతే మేం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తప్పకుండా ఎవరో ఒకరిని స్క్వాడ్‌లోకి తీసుకుంటాం. ఇక మతీశా పతిరన విషయంలో సమాచారం ఉంది. అతడు ఏప్రిల్ మధ్య వరకూ అందుబాటులో ఉండడు. అప్పటికే మ్యాచ్ ఫిట్‌నెస్ సాధిస్తాడు" అని అభిషేక్ వెల్లడించాడు. మరోవైపు పతిరనకు ఇంకా శ్రీలంక క్రికెట్ బోర్డు ఎన్‌వోసీ ఇవ్వలేదని సమాచారం. ఫిట్‌నెస్ ఆధారంగా జారీ చేసే అవకాశం ఉంది.

## అప్పుడు 7 కిలోలు తగ్గా



తనను రూ.26.75 కోట్లకు కొనుగోలు చేసిన పంజాబ్ కింగ్స్‌ను ఐపీఎల్ 2025 సీజన్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఫైనల్‌కు చేర్చాడు. బ్యాటర్‌గానూ ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆర్‌సీబీ చేతిలో ఓటమితో రన్నరప్‌గా నిలిచినా.. పంజాబ్ కింగ్స్ పోరాటం మాత్రం అదిరిపోయింది. అయితే, శ్రేయస్‌కు భారత జట్టు తరఫున మాత్రం పెద్దగా అవకాశాలు రాలేదు. గాయం వల్ల ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లోనూ చోటు దక్కలేదు. దీంతో తనకు గతేడాది చాలా కష్టంగా గడిచిందని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. గాయం వల్ల దాదాపు ఏడు కేజీల బరువు కూడా తగ్గినట్లు తెలిపాడు. గాయం నుంచి కోలుకొని రావడం చాలా కష్టమని వెల్లడించాడు.
"గాయం వల్ల నేను దాదాపు ఏడు కేజీలు బరువు తగ్గా. దానినుంచి కోలుకొని రావడం పెద్ద సవాల్‌గా నిలిచింది. నాకైన గాయం చాలా ప్రమాదకరమైందే. అయితే, రెండు నెలలు తీవ్రంగా కష్టపడిన తర్వాత.. ఇప్పుడు నా శరీరాకృతి బాగుంది. కానీ, ఫిట్‌గా ఉంటూనే ఏడు కేజీల బరువు పెరగాలంటే చాలా శ్రమించాలి. నాకు సవాళ్లు అంటే చాలా ఇష్టం. తప్పకుండా ఆ పరిస్థితిని అధిగమిస్తా. ఇలాంటివి ఎన్నోసార్లు అనుభవించా. కమ్‌బ్యాక్ చేసి భారత జట్టుకూ ఆడిన రోజులు ఉన్నాయి" అని శ్రేయస్ తెలిపాడు.
అంచనాలు భారీగానే.. : "గతేడాది మేం ఫైనల్‌కు వచ్చాం. రన్నరప్‌గా నిలిచాం. దీంతో ఈసారి మాపై భారీగానే అంచనాలు ఉంటాయి. ఎప్పుడు అడుగు వేసినా.. విజయం సాధించేందుకే ప్రయత్నిస్తాం. నా కన్ను ట్రోఫీ పైనే ఉంది. గత రెండు నెలలుగా మేమంతా ఓ కుటుంబంలా కలిసి ఉన్నాం. ఒకరినొకరం అర్థం చేసుకున్నాం. ప్రతి మ్యాచ్‌కు రెండు లేదా మూడు రోజుల ముందే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. మైదానం అవల ఉండే బాండింగ్‌తోనే మ్యాచ్‌లో మెరుగ్గా రాణించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది" అని శ్రేయస్ తెలిపాడు.

# పాక్‌లో ముదురుతున్న సంక్షోభం

### పాక్ బోర్డుపై గ్యారీ కిర్‌స్టన్ సంచలన వ్యాఖ్యలు




ప్రపంచ క్రికెట్‌లో ఒకప్పుడు టాప్ జట్లతో ఒకటిగా వెలిగిన పాకిస్థాన్ క్రికెట్ ప్రస్తుతం అత్యంత గందరగోళ పరిస్థితిలో ఉంది. కేవలం ఆటగాళ్ల ప్రదర్శన మాత్రమే కాదు, తెరవెనుక బోర్డు వ్యవహారశైలి కూడా ఆ జట్టును పతనం దిశగా నడిపిస్తోంది. ఇటీవల ఆ జట్టు మాజీ వైట్ బాల్ కోచ్ గ్యారీ కిర్‌స్టన్ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. పాక్ క్రికెట్ బోర్డు ూజదీలో ఉన్న 'టాక్సిక్' వర్క్ కల్చర్ గురించి ఆయన బయటపెట్టిన నిజాలు వింటే, అంతర్జాతీయ స్థాయిలో ఒక బోర్డు ఇంత బాధ్యతారాహిత్యంగా ఎలా ఉంటుందో అర్థమవుతుంది. అసలు కిర్‌స్టన్ అంతటి వాడే పాక్ కోచ్ పదవికి ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చింది? అక్కడ కోచ్‌లకు ఎదురవుతున్న అవమానాలు ఏంటి? అనే అంశాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఆ వివరాల్లోకి వెళితే..
అడుగడుగునా జోక్యం- పని చేసే వాతావరణం లేదు
శ్రీలంక హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో గ్యారీ కిర్‌స్టన్ పాక్ బోర్డుపై విమర్శల వర్షం కురిపించారు. బోర్డు అధికారుల జోక్యం తాను గతంలో ఎన్నడూ చూడని స్థాయిలో ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెస్సింగ్ రూమ్ వెలుపల నుంచి వచ్చే అనవసరపు ఒత్తిడి, మర్యాద లేకపోవడం వల్ల ఆటగాళ్లతో కలిసి ఒక వ్యూహాన్ని రూపొందించడం కోచ్‌లకు అసాధ్యంగా మారిందని ఆయన పేర్కొన్నారు. కేవలం ఆరు నెలల కాలంలోనే తనకు ఎదురైన చేదు అనుభవాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.
పీసీబీ పాత పద్ధతి- కోచ్‌లే బలిపశువులు!
జట్టు ఏదైనా మ్యాచ్ ఓడిపోతే వెంటనే కోచ్‌లపై ఆంక్షలు విధించడం లేదా వారిని తొలగించడం పీసీబీకి పరిపాటిగా మారిందని కిర్‌స్టన్ విమర్శించారు. పరిపాలన పరమైన లోపాలను కప్పిపుచ్చుకోవడానికి కోచ్‌లను బలిపశువులను చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. జట్టు ఆటతీరు సరిగ్గా లేనప్పుడు మద్దతు ఇవ్వాల్సింది పోయి, కోచ్‌ల అధికారాన్ని తగ్గించడం అనేది వినాశకరమని హెచ్చరించారు. కోచ్‌లకు స్వేచ్ఛ ఇవ్వనప్పుడు అసలు వారిని ఎందుకు నియమించుకుంటారని సూటిగా ప్రశ్నించారు.
రాజీనామాకు దారి తీసిన పవర్ స్ట్రగుల్
2024 టీ20 వరల్డ్ కప్ నుంచి పాకిస్థాన్ నిష్క్రమించిన తర్వాత బోర్డుకు, కోచ్‌కు మధ్య దూరం పెరిగింది. ఆటగాళ్ల ఫిట్‌నెస్, మానసిక దృఢత్వాన్ని పెంచేందుకు కిర్‌స్టన్ చేసిన ప్రయత్నాలకు బోర్డు నుంచి సహకారం లభించలేదు. దీనికి తోడు సెలక్షన్ కమిటీలో హెడ్ కోచ్‌కు ఉన్న ఓటు హక్కును పీసీబీ తొలగించడం అసలు సమస్యకు దారి తీసింది. ఆస్ట్రేలియా పర్యటనకు జట్టును ఎంపిక చేయడంలో గానీ, మహమ్మద్ రిజ్వాన్‌ను కెప్టెన్ గా నియమించడంలో గానీ కిర్‌స్టన్ ప్రమేయం లేకుండానే నిర్ణయాలు జరిగిపోయాయి. దీంతో తన గౌరవాన్ని కాపాడుకోవడానికి ఆయన పదవి నుంచి తప్పుకున్నారు.
గిల్లేస్పీకి కూడా అదే అవమానం
కేవలం కిర్‌స్టన్ మాత్రమే కాదు, ఆస్ట్రేలియా దిగ్గజం జేసన్ గిల్లేస్పీ కూడా ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొన్నారు. ఇంగ్లాండ్‌పై చారిత్రాత్మక టెస్ట్ సిరీస్ విజయం అందించినప్పటికీ, గిల్లేస్పీని బోర్డు పక్కన పెట్టింది. కనీసం ఆయనకు సమాచారం ఇవ్వకుండానే హై పెర్ఫార్మెన్స్ కోచ్ టిమ్ నీల్సన్‌ను పీసీబీ తొలగించింది. ఇది గిల్లేస్పీని తీవ్రంగా అవమానించడమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలాంటి రాజకీయాలు ఉన్న చోట ఎంతటి గొప్ప కోచ్ వచ్చినా విజయం సాధించడం అసాధ్యమని కిర్‌స్టన్ వ్యాఖ్యానించారు.
జట్టులో ఇదే అసలైన లోపం
భారత్?తో జరిగిన మ్యాచ్‌లలో ఓడిపోయిన తర్వాత, పాక్ జట్టులో కనీస ఐక్యత లేదని కిర్‌స్టన్ ఆటగాళ్లకు మొహం మీదే చెప్పినట్లు వార్తలు వచ్చాయి. బోర్డులో ఉన్న వర్గపోరు డ్రెస్సింగ్ రూమ్ మీద కూడా ప్రభావం చూపిస్తోందని ఆయన గ్రహించారు. ఆటగాళ్లు ఒకరిపై ఒకరు నమ్మకం కోల్పోవడం, బోర్డు సభ్యుల రాజకీయాలు జట్టు ప్రదర్శనను దెబ్బతీస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. లాహోర్‌లోని బోర్డు కార్యాలయం నుంచి వచ్చే నిర్ణయాలు క్రికెట్ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువగా ఉన్నాయని అన్నారు.
పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తన పంథాను మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ఆ జట్టు మరింతగా దిగజారిపోయే ప్రమాదం ఉంది. మోహ్సిన్ నఖ్వీ నేతృత్వంలోని బోర్డు ప్రొఫెషనల్స్ కు ఇచ్చే గౌరవం ఏంటో కిర్‌స్టన్, గిల్లేస్పీ ఉదంతాలు నిరూపించాయి. కిర్‌స్టన్ చేసిన కామేంట్స్ మళ్ళీ చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ూజదీ తరచుగా భారతదేశంపై ఏదో ఒక రకంగా విషం చిమ్ముతూనే ఉంటుంది. అయితే గురువులకు కనీసం గౌరవం ఇవ్వకుండా ఉండడంతో తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. మరి కిర్‌స్టన్ కామెంట్స్ విషయంలో జదీ రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.

# సినిమా

# ఎన్టీఆర్ 'డ్రాగన్' లుక్ వెనుక అసలైన కారణం?

యంగ్ టైగర్ ఎన్టీఆర్ మరోసారి తన ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సినీ వర్గాలను, అభిమానులను ఆశ్చర్యపరిచారు. తన తాజా చిత్రం డ్రాగన్ కోసం ఆయన గణనీయంగా బరువు తగ్గి మరింత సన్నగా మారడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ లుక్ చూసిన ఫ్యాన్స్‌లో ఓ వైపు ఆశ్చర్యం, మరోవైపు ఆందోళన కనిపిస్తోంది. సోషల్ మీడియాలో ఎన్టీఆర్ బాగానే ఉన్నారా? అనే చర్చలు కూడా ఊపందుకున్నాయి. అయితే ఈ మార్పు పూర్తిగా పాత్ర కోసం చేసిన ప్రణాళికాబద్ధమైన ట్రాన్స్‌ఫర్మేషన్ అని ఆయన సన్నిహిత వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. 7 వారాల్లోనే 10 కిలోలు తగ్గిన తారక్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా కోసం పాత్రకు తగ్గట్టుగా లీన్ ఫిజిక్ కావాలని డైరెక్టర్, ఎన్టీఆర్ ను కోరినట్లు సమాచారం. దానికి తగ్గట్టుగా ఎన్టీఆర్ కఠినమైన ఫిట్‌నెస్ రొటీన్‌ను అనుసరించి, రోజుకు సుమారు 90 నిమిషాల పాటు ఫంక్షనల్ ట్రైనింగ్ చేస్తూ, కంట్రోల్డ్ డైట్ తో కేవలం 7 వారాల్లోనే దాదాపు 10 కిలోల బరువు తగ్గినట్లు తారక్ ట్రైనింగ్ టీమ్ వెల్లడించింది. ముఖ్యంగా లో ప్రోటీన్ డైట్‌తో పాటు క్రమశిక్షణే ఈ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు కారణమని వారు చెబుతున్నారు. పలుమార్లు ట్రాన్స్‌ఫర్మేషన్ చేసిన ఎన్టీఆర్ ఇది ఎన్టీఆర్‌కు కొత్త విషయం కాదు. గతంలో కూడా ఆయన పలు సినిమాల కోసం తన ఫిజిక్‌ను పూర్తిగా మార్చుకున్నారు. అప్పటివరకు బొద్దుగా, లావుగా ఉన్న తారక్.. యమదొంగ కోసం స్లిమ్ లుక్‌లో కనిపించి అందరినీ ఒక్కసారిగా ఆశ్చర్యపరిచారు. ఆ తర్వాత టెంపర్ సినిమాకు సిక్స్ ప్యాక్‌తో అలరించారు. తర్వాత అరవింద సమేత వీర రాఘవ, ఆర్ఆర్ఆర్ వంటి సినిమాల కోసం కూడా తన మేకోవర్‌ను తారక్ ఎంతో విభిన్నంగా మలుచుకున్నారు. అయితే ఈసారి డ్రాగన్ కోసం చేసిన ట్రాన్స్‌ఫర్మేషన్ మాత్రం గతంతో పోలిస్తే మరింత ఎక్స్‌ట్రీమ్‌గా ఉండటం గమనార్హం. ఇంత సన్నగా మారడం ఎన్టీఆర్ కెరీర్‌లో ఇదే మొదటిసారి కావడంతో ఇది ప్రత్యేక చర్చనీయాంశమైంది. లుక్ కారణంగా మరింత హైప్ అయితే, ఈ భారీ మార్పు సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఇప్పటికే భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా, ఎన్టీఆర్ లుక్ కారణంగా పాన్ ఇండియా స్థాయిలో మరింత హైప్‌ను సొంతం చేసుకుంటోంది. అభిమానులు కూడా ఈ లుక్ వెనుక కథ ఏమిటి? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో, ఆయన ఆరోగ్యం బాగానే ఉందని తెలిసినా, అభిమానులు మాత్రం జాగ్రత్తగా ఉండాలంటూ సోషల్ మీడియాలో తమ ప్రేమను వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతుండగా, ఇటీవల జోర్డాన్‌లో కీలక షెడ్యూల్ ను పూర్తి చేశారు. ఈ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా రిలీజ్ డేట్ పై త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుంది.



## 'డెకాయిట్' నుంచి జైన్ మేరీ ఖాన్



బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్ లో డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలి సారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించను న్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తు న్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ కజిన్ బ్రదర్ కుమార్తె జైన్ మేరీ ఖాన్ తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తోంది. జైన్ మారీ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఖాకీ యూనిఫామ్‌లో భుజాలపై స్టార్ ఎపాలెట్స్, హోల్స్టర్ బెల్ట్‌తో తుపాకీ పట్టుకుని ముందుకు గురిపెట్టిన ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా కనిపిస్తోంది. ఈ పోస్టర్‌లో జైన్ పాత్ర యొక్క ఇంటెన్సిటీ స్పష్టంగా కనిపిస్తోంది. వెనుక వైపు ఇతర పోలీస్ అధికారులు ఉండటం ఈ సన్నివేశానికి మరింత బలం చేకూర్చింది. ఈ పోస్టర్‌ను చూసిన ఆమిర్ ఖాన్ వెంటనే స్పందించి అభినందనలు తెలుపుతూ మొత్తం టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మెసేజ్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హిందీ ప్రేక్షకుల్లో సినిమాకు మరింత హైప్‌ను తెచ్చింది.

## 'పిఠాపురంలో అలా మొదలైంది' మా 'ప్రేయసిరావే' రేంజ్‌లో హిట్ అవ్వాలి



డాక్టర్ రాజేంద్రప్రసాద్, పథ్వీరాజ్, కేదార్ శంకర్, మణి చందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన పాత్రల్లో ప్రముఖ దర్శకుడు మహేష్ చంద్ర రూపొందించిన చిత్రం 'పిఠాపురంలో'. దీనికి ఉప శీర్షిక 'అలా మొదలైంది'. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్‌పై దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటి వరకు ఈ సినిమాకి సంబంధించి బయటకు వచ్చిన కంటెంట్ ప్రేక్షకుల్ని కట్టి పడేసింది. ఇక తాజాగా శుక్రవారం నాడు ఈ మూవీకి సంబంధించిన ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి 'ప్రేయసి రావే' టీం హీరో శ్రీకాంత్, పృథ్వీ, శివాజీ రాజా, ఎంఎం శ్రీలేఖ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూలి .. "ప్రేయసి రావే' కంటే ముందు నేను చేసిన కొన్ని చిత్రాలు సరిగ్గా ఆడలేదు. చంద్ర మహేష్ గారు నాతో తీసిన 'ప్రేయసి రావే' అద్భుతమైన విజయం సాధించింది. అందులో పృథ్వీ , శివాజీ రాజా అద్భుతంగా నటించారు. శ్రీలేఖ ఆ సినిమాకు ఇచ్చిన పాటలు ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటాయి. అప్పట్లో చంద్ర మహేష్ కొత్త వాడే అయినా గొప్పగా సినిమాని తీశాడు. ఈ 'పిఠాపురంలో అలా మొదలైంది' సినిమా కథ గురించి కూడా నాకు మహేష్ చెప్పాడు. మూడు డిఫరెంట్ కథలతో ఈ మూవీని అద్భుతంగా తీశాడని అర్థం అవుతోంది. పిల్లలు, తల్లిదండ్రులు కలిసి ఈ సినిమాని చూడాలి. ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుందని నేను నమ్ముతున్నాను. 'పిఠాపురంలో అలా మొదలైంది' మూవీ మా 'ప్రేయసిరావే' రేంజ్‌లో హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను . మంచి కంటెంట్, కాన్సెప్ట్ దొరికితే చంద్ర మహేష్, నేను కలిసి సినిమా చేస్తామ"ని అన్నారు.

# 'వంద దేవుళ్లు' ఫస్ట్ లుక్

మల్టీ టాలెంటెడ్ విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కాంబోలో వచ్చిన 'బిచ్చగాడు' చిత్రం ఎన్ని రికార్డుల్ని క్రియేట్ చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మళ్లీ ఇన్నేళ్ల తరువాత ఈ కాంబో కలిసి వచ్చింది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో 'వంద దేవుళ్లు' అనే చిత్రం రాబోతోంది. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. తాజాగా డైనమిక్ స్టార్ విష్ణు మంచు ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ ఎంతో ఇంటెన్స్‌గా కనిపిస్తోంది. చెరుకు తోటలో విజయ్ ఆంటోనీ కత్తి పట్టుకున్న తీరు, వెనకాలే స్వాసిక మాసీ లుక్ అదిరిపోయింది. విజయ్ ఆంటోని ఇందులో రా అండ్ రస్టిక్ పాత్రని పోషిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేస్తూ చిత్రయూనిట్‌కు విష్ణు మంచు ఆల్ ది బెస్ట్ తెలిపారు.




# 'యూత్' నుంచి 'సఖియే..' లిరికల్ సాంగ్



కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ "యూత్". ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 26న "యూత్" మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. 'కమ్ విత్ యువర్ గ్యాంగ్, నోట్ – నో ఏజ్ లిమిట్' అనే స్లోగన్ తో ఈ సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్ చేస్తున్నారు.

ఇప్పటికే రిలీజ్ చేసిన ఈ మూవీ ట్రైలర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. "యూత్" సినిమా నుంచి 'సఖియే..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. జీవీ ప్రకాష్ కుమార్ బ్యూటిఫుల్ కంపోజిషన్ చేసిన 'సఖియే..' లిరికల్ సాంగ్ కు కిట్టు విస్సాప్రగడ సాహిత్యాన్ని అందించగా, సింజిత్ యెర్రమల్లి, సింధుజ తణుకు ఆకట్టుకునేలా పాడారు. 'సఖియే..' సాంగ్ ఎలా ఉందో చూస్తే – 'పలికానే పెదాలతోనే పలుమార్లు ఇలా నీ పేరే, అలవాటే లేదాయే వెతికే మాయవి నీవేలే, ఒక మాటే మాటాడమంటే మదిదాటి రాలేను అందే, విన్నావా అంటూనే పిలిచాయే నా మౌనాలే, కలవా, కథవా నను తాకే అలవా, మనసే సంద్రంలా మారిందా,..సఖియే, సఖియే..' అంటూ యువ జంట పాడుకునే అందమైన ప్రేమపాటగా సాగుతుంది.

## భారీ పాన్ ఇండియా సోషియో ఫాంటసీలో సందీప్ కిషన్



'శంబాల' బ్లాక్ బస్టర్ తరువాత దర్శకుడు యుగంధర్ ముని, నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు మళ్లీ ఓ అద్భుతాన్ని సృష్టించేందుకు రెడీ అయ్యారు. 'శంబాల' తరువాత దర్శక, నిర్మాతలు కలిసి ఎటువంటి ప్రాజెక్ట్ చేస్తారా? అని అంతా ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. ఆ ఎదురుచూపుకి సమాధానంగా సందీప్ కిషన్‌తో ఓ భారీ పాన్ ఇండియా సోషియో ఫాంటసీ మూవీని మేకర్స్ ప్లాన్ చేశారు. ఈ సినిమా ప్రకటన కోసం ఓ క్రేజీ కాన్సెప్ట్ పోస్టర్‌ను వదిలారు. ఈ పోస్టర్‌లో ఒక సింహం, తోడేలు కనిపిస్తున్నాయి. యుద్ధభూమి బ్యాక్ గ్రౌండ్ లో సింహం, తోడేలు మధ్య ఒక పురాతన ఖడ్గం ప్రకాశిస్తూ అలా నిటారుగా నిల్చుని ఉంది. 'కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు. కొంతమంది రాజులు ఎప్పటికీ మరణించరు' అనే క్యాప్షన్ చూస్తే ఈ చిత్రం ఏ రేంజ్‌లో ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం దర్శక, నిర్మాతలు సక్సెస్ ఫుల్ హీరో సందీప్ కిషన్‌ను ఎంచుకున్నారు. ఈ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్‌తో ఒక సరికొత్త ప్రపంచంలోకి ప్రేక్షకుల్ని తీసుకెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఇది దర్శకుడు యుగంధర్ ముని, నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ కలిసి చేస్తున్న రెండో ప్రాజెక్ట్. ఈసారి సృజనాత్మక, సాంకేతిక ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ఈ సినిమాని రూపొందించేందుకు రెడీగా ఉన్నారు. ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఇది సందీప్ కిషన్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన చిత్రాలలో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు. ఒక గొప్ప సినిమా అనుభూతిని అందించడానికి, నిర్మాతలు ప్రొడక్షన్ డిజైన్, విజువల్ ఎఫెక్ట్స్, కథనం విషయంలో అన్ని విధాలా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## ప్రతిష్ఠాత్మక అవార్డ్స్ దక్కించుకుంటున్న బన్నీ వాస్



అవార్డ్ విన్నింగ్ చిత్రాలు, కమర్షియల్ మూవీస్..ఈ రెండూ భిన్నమైనవి. పురస్కారాలు గెల్చుకునే సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ దక్కదు అలాగే కమర్షియల్ మూవీస్ కు అవార్డ్స్ వచ్చే అవకాశాలు తక్కువ. కానీ నిర్మాతగా మంచి వ్యాల్యూస్, కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రాలను నిర్మిస్తూ, డిస్ట్రిబ్యూట్ చేస్తూ ప్రేక్షకుల రివార్డ్స్, అవార్డ్స్ సొంతం చేసుకుంటున్నారు ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్. ఆయన ఇటీవల నిర్మించిన, డిస్ట్రిబ్యూట్ చేసిన సినిమాలు అంబాజీపేట మ్యారేజి బ్యాండు, ఆయ్, తండేల్, లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి సినిమాలు కమర్షియల్ గా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించడమే కాదు పలు ప్రతిష్ఠాత్మక అవార్డ్స్ గెల్చుకోవడం విశేషం. బన్నీ వాస్ నిర్మించిన ఆయ్ సినిమా హోల్ సమ్ ఎంటర్ టైనర్ గా గతేడాది గద్దర్ అవార్డ్ ను గెల్చుకుంది. అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్రానికి సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్ తో పాటు బెస్ట్ సపోర్టింగ్ యాక్ట్రెస్ గా శరణ్య కు గద్దర్ అవార్డ్ దక్కింది. ఈ ఏడాది తండేల్ సినిమా బెస్ట్ యాక్టర్, ఉత్తమ జాతీయ సమగ్రతా చిత్రంగా రెండు గద్దర్ అవార్డ్స్ సొంతం చేసుకుంది. ఉత్తమ నటుడిగా నాగచైతన్య గద్దర్ అవార్డ్ గెల్చుకున్నారు.

# 'డైమండ్ డెకాయిట్' ఆడియో రిలీజ్

**పాటలు విడుదల చేసిన వీఎన్ ఆదిత్య - చిత్రంలోని పాటకు హుక్ స్టెప్ వేసిన వారికి లక్ష బహుమతి ప్రకటన**

తెలుగు తెరపై సరికొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన ఎమోషనల్ రివెంజ్ డ్రామా 'డైమండ్ డెకాయిట్'. పార్థ గోపాల్ నిర్మాణంలో, దర్శకుడు సూర్య జి యాదవ్ దర్శకత్వంలో, పార్థ గోపాల్ – మేఘన జంటగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగింది. ప్రముఖ మ్యూజిక్ సంస్థ మధుర ఆడియో ద్వారా ఈ పాటలను ముఖ్య అతిథిగా తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య పాల్గొని విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఓ వినూత్న పోటీకి తెర లేపింది. ఈ చిత్రంలోని "మరదలివే" పాటకు హుక్ స్టెప్ ఛాలెంజ్ ను ప్రకటించింది. ఆసక్తిగల వారు వారు ఆ పాటకు తమ హుక్ స్టెప్‌తో రీల్స్ రూపొందించి, ఆ రీల్స్ లింక్‌ను 8074801661 వాట్సాప్ నంబర్‌కు పంపవచ్చు.



# ఏప్రిల్ 17న 'తిమ్మరాజుపల్లి టీవీ'

న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ లో "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా గ్రాండ్ రివీల్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు తేజ విహాన్ మాట్లాడుతూ – ఇలా కొత్త వాళ్లతో మూవీ చేసి వాళ్లను ప్రోత్సహించాలనేది కిరణ్ అన్న కల. ఆయన ఎస్ ఆర్ కల్యాణమండపం సినిమా రిలీజ్ ముందే కొత్త వాళ్లతో మూవీ చేయాలని నిర్ణయించుకున్నారు. కిరణ్ అన్న ఇంకా ఇండస్ట్రీలో సెటిల్ కాని టైమ్ అది. కొత్త వాళ్లతో సినిమా చేసే గుండె ధైర్యం ఆయనలో ఉంది. ఇండస్ట్రీలో కిరణ్ అన్న సక్సెస్, ఫెయిల్యూర్స్ చూశారు. తను నిలబడి తనతో పాటు మరికొంతమందిని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమాలో టీవీ కుమార్ గా మిమ్మల్ని ఎంటర్ టైన్ చేయబోతున్నా. అన్నారు.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044-